

నేడు జిల్లాకు కేంద్ర కరువు బృందం రాక

● రేపు క్షేత్రస్థాయిలో పరిశీలన ● కలెక్టర్ శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేంద్ర కరువు బృందం ఈనెల 7, 8 తేదీల్లో పర్యటిస్తుందని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర కరువు పరిశీలన బృందం ఈనెల 7న బెంగళూరు నుంచి బయలుదేరి మదనపల్లె డివిజన్ హార్సిలీహిల్స్‌లో బస చేస్తారన్నారు. 8న ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని, మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా నుంచి తిరిగి బెంగళూరు బయలుదేరి వెళతారని తెలిపారు. బృందంలో నలుగురు సభ్యులు ఉంటారని ఇందులో కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ పేరినీ దేవి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల బృందం పర్యటిస్తుందని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితులను వారు పరిశీలిస్తారన్నారు. అప్పటి పరిస్థితులను కళ్లకు కట్టే విధంగా ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసి కరువు బృందానికి వివరించాలన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో కూడా వాస్తవ పరిస్థితులు వారికి అవగాహన కలిగేలా అధికారులు వివరించాలన్నారు. వాటికి సంబంధించి స్పష్టమైన నివేదికలు రూపొందించాలని తెలిపారు. అనంతరం వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి సీపీవో వెంకటపెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై శ్రద్ధ పెట్టండి

జిల్లాలో భూసమస్యలపైనే ఎక్కువ శాతం అర్జీలు పీజీఆర్ఎస్‌లో వస్తున్నాయని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా అన్ని డివిజన్లలో ఉన్న అధికారులు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భూసమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదులకు కలెక్టర్ వెంటనే స్పందించి ఆయా మండలాల తహసీల్దార్‌లతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించి మళ్లీ నాకు తెలియజేయాలని ఆదేశాలు ఇవ్వడంతో చాలా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు చెప్పుకొస్తున్నారు. మదనపల్లె, రాజంపేట, రాయచోటి డివిజన్లలోని అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని భూసమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరించి అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలని ఆదేశించారు. అంతేగాకుండా మదనపల్లె, రాజంపేట డివిజన్లలోని అర్జీదారులు ఎక్కువగా భూసమస్యలపైనే రాయచోటి కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. రాజంపేట డివిజన్‌లో 37 అర్జీలు సీఎంవోలో పెండింగ్ ఉన్నాయి, అలాగే ఎక్కువ శాతం పుల్లంపేట మండలం నుంచే అర్జీలు వస్తున్నాయని తెలిసింది. అలాగే మదనపల్లె డివిజన్‌లో 52 అర్జీలు పెండింగ్ ఉండగా అందులో 29 సీఎంవోలో పెండింగ్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో 26 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, అందులో చిన్నమండెం మండలంలో 11 అర్జీలు సర్వే డిపార్టుమెంట్‌కు సంబంధించినవని తెలిసింది. సంబేపల్లెలో కూడా దాదాపు 22 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు లెక్కలు ఉన్నాయి. ఇంకా కొన్ని మండలాల్లో తహసీల్దార్లు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల వచ్చి అర్జీదారులే మళ్లీ మళ్లీ వస్తున్నారని తెలుస్తోంది. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

శ్రీగంధం సాగు.. ఆదాయం బాగు...

● గతంలో పొలాల గట్లపై...

● స్మగ్లర్లతో అంతరించిన వైనం

● మళ్లీ సాగు చేస్తున్న రైతులు

● కోడూరు నుంచి ఏడాదికి 6 లక్షల మొక్కల ఎగుమతి



6


వైసీపీ పాపం విద్యార్థులకు శాపం



విలీనం కారణంగా సుండుపల్లెలో మూతబడిన పాఠశాల



కొత్తపల్లిలో మూతబడిన ప్రభుత్వ బడి



వాయల్పాటివాండ్లపల్లెలో మూతబడిన బడి చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

● విలీనంతో ప్రైవేటు స్కూల్స్ వైపు విద్యార్థులు..

● ప్రభుత్వ బడుల్లో గణనీయంగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

● బలోపేతంపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి

● ప్రభుత్వ బడులకు రూ.9.01 లక్షలు విడుదల

సుండుపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు విద్యావ్యవస్థకు శాపాలుగా మారాయి. అసలే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ బడులకు, విద్యార్థులకు గుదిబండలా మారాయని, విద్యా వ్యవస్థపై అవగాహ న లేకుండా నిర్ణయాలు తీసుకున్నారని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలన్న నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, ఇతర మేధావులతో చర్చించకుండానే జగన్‌మోహన్‌రెడ్డి తుగ్లక్‌లాగా వ్యవహరించారని, ఆ నిర్ణయంతో నేడు విద్యార్థులు ప్రభుత్వ బడులను వీడి ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో నెంబర్-117 కారణంగా 2023-24 విద్యాసంవత్సరంలో సుండుపల్లె మండలంలో ని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, గిరిజన గురుకుల పాఠశాలతో సహా 88 పాఠశాలల్లో 4,875 మంది విద్యార్థులు చదివేవారు. అయితే 2024-25 విద్యా సంవత్సరంలో 4,091 మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ బడు ల్లో విద్యను అభ్యసిస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సుమారు 746 మంది విద్యార్థినీ, విద్యార్థుల సంఖ్య తగ్గింది.

జీవో 117 ఆ బడులకు శాపం

మూడు, నాలుగు తరగతులను హైస్కూల్‌లలో విలీనం చేయాలని గత వైసీపీ ప్రభు త్వం తీసుకువచ్చిన జీవో నెంబర్-117 సుండుపల్లె మండలంలోని కొన్ని ప్రభుత్వ బడులకు శాపంగా మారింది. గుంతరాచపల్లి, జి.రెడ్డివారిపల్లె, మడితాడు (ఉర్దూ), జీకే రాచపల్లి, తిమ్మసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో కిలోమీటర్ పరిధిలో ఉండే ప్రభుత్వ బడుల్లో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను విలీనం చేశారు. ఈ విధంగా విలీనం చేయడం వలన చిన్నారులు కిలోమీటరు దూరం రోడ్ల మీద నడిచి వెళ్లేందుకు వీలుకాకపోవడంతో కొంతమంది ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. మరికొంత మంది హైస్కూళ్లకు అష్టకష్టాలు పడి వెళుతున్నారు. కొంతమంది చిన్నారులను అంగన్వాడీ కేంద్రానికి పంపించి కాలయాపన చేస్తున్నారు. ఈ విధంగా చేయడం వలన విద్యార్థులు ప్రాథమిక పాఠశాలల నుంచి ప్రాథమికోన్నత పాఠశాలలకు వెళ్లిపోవడంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడికి ఒకరు, ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నారు. కొన్ని పాఠశాలలు మూతబడేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని పాఠశాలలు మూతపడ్డాయి.

జి.రెడ్డివారిపల్లెలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో జీవో-117 అమలులోకి వచ్చిన తరువాత 100 మంది విద్యార్థులు ఉండే పాఠశాలలో నేడు కేవలం 16 మంది మాత్రమే ఉన్నారు. జీకే రాచపల్లె ప్రాథమిక పాఠశాలలో విలీనం కాక ముందు 70 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 17 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కొంతమంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లగా మరికొంతమంది ప్రైవేటు స్కూళ్లకు వెళ్లినట్లు సమాచారం. తిమ్మసముద్రం ఉర్దూ స్కూల్‌లో విలీనం కారణంగా మూడు తరగతి గదుల్లో 105 మంది విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తుండడంతో కూటమి ప్రభు త్వం రానున్న విద్యా సంవత్సరానికి గతంలో జరిగిన పాఠశాలల విలీనాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో అందరూ హర్షిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిధులు విడుదల

కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తోంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కావడం విద్యా వ్యవస్థకు ఎంతో దోహదపడుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. 2024 డిసెంబరు నెలలో ప్రభుత్వ బడులకు 20 మంది విద్యార్థులకు లోపు ఉండే ప్రభుత్వ బడులకు రూ.5 వేలు, 20 మంది విద్యార్థులకుపైన ఉన్న ప్రభుత్వ బడులకు రూ.12 వేలు, 60కిపైబడి ఉన్న ప్రభుత్వ బడులకు రూ.15 వేలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నిధులను ఆ పాఠశాలకు సంబంధించిన అకౌంట్లకు విడుదల చేశారు. మండల వ్యాప్తంగా రూ.9,01,000 నిధులు విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ అధ్యక్షులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలల నిధులు విడుదల చేయకపోగా ఉపాధ్యాయులపైన కక్ష సాధింపు చేశారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూడు గదుల్లో 105 మంది విద్యార్థులు చదువుతున్న తిమ్మసముద్రం ఉర్దూ ఉన్నత పాఠశాల

పూర్వవైభవం వచ్చేనా!

గత కొన్ని సంవత్సరాలుగా సుండుపల్లె మండలంలో మూతబడిన ప్రభుత్వ బడులను ప్రారంభించాలని, పూర్వ వైభవం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పల్లెల్లో విద్యార్థులు ఉన్న కొన్ని బడులు మూతబడ్డాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుండుపల్లె మండల వ్యాప్తంగా ప్రస్తుతం 15 ప్రభుత్వ బడులు మూతబడి ఉన్నాయి. చిన్నబడికి, బండివాండ్లపల్లె, కోనేరువాండ్లపల్లె, చెన్నరాజుగారిపల్లె, చీనేవాండ్లపల్లె, కోనంకివారిపల్లె, నీలకంవాండ్లపల్లె, మల్లక్కగారిపల్లె, ఈడిగపల్లె, రెడ్డివారిపల్లె, కంచిపాటివాండ్లపల్లె, బేరిపల్లె, కొత్తపల్లి, వాయల్పాటివాండ్ల పల్లెల్లో మూతబడిన ప్రభుత్వ బడులను ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కొత్తపల్లిలో సుమారు 15 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరూ బాలిరెడ్డిగారిపల్లెలో ఉన్న ప్రభుత్వ బడికి సుమారు కిలోమీటర్‌కు పైబడి ఉన్న హైస్కూల్‌కు వెళుతున్నారని, కొత్తపల్లెలో మూతబడిన పాఠశాలను రీఓపెన్ చేయాలని కోరుతున్నారు. ఇదేవిధంగా మరికొన్ని పల్లెల్లో బడుల రీఓపెన్‌కు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్తపల్లిలో బడి రీఓపెన్ చేయండి..



మా ఊరిలో ఉన్న ప్రభుత్వ బడిని కొన్నేళ్ల క్రితం మూసివేశారు. సుమారు 15 మంది విద్యార్థులు మా ఊరిలో ఉన్నారు. ప్రతిరోజూ బాలిరెడ్డిగారిపల్లెకు నడిచి బడికి వెళుతున్నారు. మా ఊరిలో బడి రీఓపెన్ చేస్తే చిన్నారులకు కష్టం ఉండదు.

- దేవపట్ల సునీత, కొత్తపల్లి

విద్యార్థులు ఉంటే రీఓపెన్ చేస్తాము..

ప్రభుత్వ బడులు మూతబడిన పల్లెల్లో విద్యార్థులు ఉంటే సమాధానం ఇస్తే ప్రభుత్వ బడులను రీఓపెన్ చేస్తాము. అన్ని మౌలిక వస్తువులతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నాము.

- వెంకటేశ్‌నాయక్, ఎంఈవో, సుండుపల్లె

పందేనికి సై...

● కత్తులు నూరుతున్న పందెంరాయుళ్లు

● నిఘా పెట్టిన పోలీసులు

● రూ.వేల నుంచి లక్షల్లో పలుకుతున్న జాతి కోళ్లు



రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి పది రోజుల నుంచే కోడి పందేలకు కోళ్లు సిద్ధం చేస్తున్నారు. వారం రోజుల నుంచి నియోజకవర్గంలో కోడిపందేలు జరుగుతున్నాయి. పోలీసులు నిఘా పెట్టినా ఫలితాలు కానరావడం లేదు. కోడి పందెం రాయుళ్లకు రాజకీయ నాయకుల అండ ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కోడి పందేలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సంక్రాంతి పండుగలకు కోడిపందేలు జరగడం సర్వ సాధారణంగా మారింది. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో కోడిపందేలు సాగుతుంటాయి. కొందరు సరదాగా, మరికొందరు జూదంగా ఆడుతుంటారు. పందేనికి మేలు రకం కోళ్లకు రెండు నెలల నుంచి పందేనికి తర్ఫీదు ఇస్తారు. కోళ్లతో ఈత కొట్టించడం, జీడిపప్పు, రాగులు, సజ్జలు, బియ్యం, జొన్నలు, కొర్రలు, బాదం, జీడిపప్పు తదితరాలను తీసుకుని కలిపి పెడతారు. ప్రతి రోజూ వ్యాయామం చేయిస్తారు. చలిలేకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వాటిని చిన్నపిల్లల కంటే ఎక్కువగా కాపాడుకుంటారు. కోళ్లల్లో సేలం కోడికి ప్రాధాన్యం ఎక్కువ. ఈ కోళ్లు చాలా ధర పలుకుతాయి. కాకినెమలి, తెల్లనెమలి, గాజునెమలి, పూసనెమలి, కాకిడేగ, డేగ తదితర రకాలు ఉంటాయి. కొన్ని రకాల కోళ్లు సాయంత్రం వేళల్లో పందేలు ఆడవు. కొన్ని మాత్రమే ఆడతాయి. కోడిపందేలు నిర్వహించేందుకు చెరువులు, వ్యవసాయ పొలాలు తదితర ప్రాంతాలను ఎంచుకుంటారు. తెల్లనెమలి కోడిపుంజు రూ.25 వేలు, కాకినెమలి రూ.20 వేల నుంచి రూ.25 వేలు, కాకిడేగ రూ.15 వేల నుంచి రూ.20 వేలు, పూసనెమలి రూ.28 వేలు, డేగ రూ.25 వేలు ధరలు ఉంటాయి. అదే కాకుండా మంచి పందెంకోళ్లు అయితే రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షలు కూడా పలుకుతాయి. సేలం పుంజులు అయితే లక్షల్లో ధరలు ఉంటాయి. 6 నెలల వయస్సు లోనే ఇలాంటి ధరలు పలుకుతాయి. ఇదిలా ఉండగా కోడి పందేలు రూ.5 వేల నుంచి రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.30 వేల రూ.50 వేల నుంచి లక్షకు పైగా పందేలు పెట్టి ఆడించడం కొసమెరుపు.




తెల్ల నెమలి జాతి పుంజు



కోళ్ల కాళ్లకు కట్టే కత్తులు

కోడిపందేలపై ప్రత్యేక నిఘా



-కె.హేమసుందరరావు, సీఐ, రైల్వేకోడూరు

కోడి పందేలపై ప్రత్యేక నిఘా పెట్టి ఉన్నామని, సమాచారం వచ్చిన వెంటనే కోడి పందేల స్థావరాలపై దాడులు చేస్తున్నామని, కోడిపందేలకు అనుమతి లేదని, ఆడే వారిపై చర్యలు తీసుకుంటాము. కోడిపందేలు జరుగుతున్నట్లు ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నిరంతరాయంగా కోడిపందేలపై దాడులు చేస్తున్నాము. చెరువులు, కుంటలు, పొలాల వద్ద కోడిపందేలు జరుగుతున్నాయని సమాచారం ఉంది. దీంతో అక్కడ పోలీసులతో నిఘా పెట్టాము.

ప్రాణాలు తీసిన పొగమంచు

● కాలినడక భక్తులను ఢీకొన్న 108 వాహనం

● ఇద్దరి దుర్మరణం, ఐదుగురికి గాయాలు

● కమ్మేసిన మంచులో సంభవించిన ప్రమాదం

చంద్రగిరి /రామసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఐదుగురిని ఆస్పత్రి పాల్జేసింది. చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో మదనపల్లె జాతీయ రహదారిలో నారాయణ కళాశాల వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు చనిపోయారు. పుంగనూరు సమీపంలోని రామసముద్రం మండలం శేగంవారిపల్లెకు చెందిన సుమారు 60 మంది శ్రీవారి భక్తులు ఆదివారం కాలినడకన తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరారు. సోమవారం తెల్లవారుజామున 3-30 గంటలకు నరసింగాపురం వద్ద వీరిని 108 వాహనం ఢీకొంది. ఏడుగురికి తీవ్ర గాయాలవ్వడంతో అదే వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పెద్దరెడ్డమ్మ (40), లక్ష్మమ్మ (50)లు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తులసమ్మ, రమేష్, చిన్నరెడ్డమ్మ, రెడ్డమ్మ, యశోదమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. తులసమ్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలు పెద్ద రెడ్డమ్మ,ఆమె భర్త రమణ వ్యవసాయ కూలీలు. కుమారులు రెడ్డిమోహన, రెడ్డిప్రసాద్‌లు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. మరో మృతురాలు లక్ష్మమ్మకు భర్త లక్ష్మన్న, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు నవీన్ డిగ్రీ చదివి ఉద్యోగం ప్రయత్నంలో ఉన్నాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పెద్ద రెడ్డెమ్మ, లక్ష్మమ్మ మృతదేహాలు

మంచులో ప్రయాణాలు తగదు

తీవ్రమైన చలి, పొగమంచు కమ్ముకోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. తెల్లవారుజామున వేగంగా వస్తున్న 108 వాహనానికి లైటింగ్ కనిపించలేదని తెలుస్తోంది. మదనపల్లెకు చెందిన హరికృష్ణకు గుండెపోటు రావడంతో ఈ వాహనంలో తిరుపతి తరలిస్తున్నారు. అదే సమయంలో భక్తులు చలి, పొగమంచును సైతం పట్టించుకోకుండా నడిచి వస్తున్నారు. శ్రీవారిమెట్టు వద్ద ఉదయం 6 గంటలకు కాలినడక భక్తులకు దర్శనం టోకెన్లు పరిమితంగా ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 5 గంటల కల్లా ఎక్కువమంది శ్రీవారి మెట్టుకు త్వరగా చేరుకుంటున్నారు. కాగా మంచు విపరీతంగా ఉన్నందున వాహనదారులు అర్ధరాత్రి దాటాక ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సీఐ సుబ్బరామిరెడ్డి సూచిస్తున్నారు. అత్యవసర ప్రయాణాలైతే నిదానంగా వాహనాలను నడపాలంటున్నారు. తరచూ ఆగుతూ వాహనాల ముందు అద్దాలను తుడుచుకోవాలని సూచిస్తున్నారు రాత్రి పూట పాదయాత్రను వాయిదా వేసుకుని, పగటి పూట నడవాలని శ్రీవారి భక్తులను ఆయన కోరుతున్నారు.



ప్రమాదంలో గాయపడ్డవారు

మొదటి రోజు 152 పెన్షన్ల పరిశీలన

● జిల్లాకు ఆరు బృందాల కేటాయింపు

రాయచోటి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అర్హతలతో సంబంధం లేకుండా వైసీపీ నాయకులో... కార్యకర్తలో అయితే చాలు.. అనేవిధంగా గతంలో పెన్షన్లు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బోగస్ పెన్షన్లపై కొరఢా ఝులిపించనుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వంద శాతం వికలత్వం, మంచం లేదా వీల్‌ఛైర్‌కు పరిమితం అయిన వాళ్లకు నెలకు రూ.15 వేలు పెన్షన్ ఇస్తోంది. అయితే ఈ పెన్షన్లలోనే ఎక్కువగా బోగస్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఈ బోగస్ పెన్షన్ల పనిపట్టేందుకు అధికారులు నడుం బిగించారు. మొదటిరోజు జిల్లాలోని మూడు మునిసిపాలిటీలు, నాలుగు మండలాల్లో ఈ పరిశీలన మొదలైంది. రాజంపేట, మదనపల్లె, రాయచోటి మున్సిపాలిటీలు, రాజంపేట, గుర్రంకొండ, పీలేరు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఈ పరిశీలన జరిగింది. జిల్లాలో ఇటువంటి పెన్షన్లు మొత్తం 1611 ఉన్నాయి. మొదటి రోజు ఇందులో 152 పరిశీలించారు. ఇంకా 1459 పరిశీలించాల్సి ఉంది. ఈ పెన్షన్ల పరిశీలనకు జిల్లాకు ఆరు బృందాలను కేటాయించారు. ఇప్పటి వరకు 152లో ఎన్ని బోగస్ ఉన్నాయనేది అధికారులు బయటపెట్టలేదు. జిల్లా వ్యాప్తంగా పరిశీలన పూర్తి అయిన తర్వాతే బోగస్ పెన్షన్ల బాగోతం బయటకు వచ్చే అవకాశం ఉంది.



పీలేరులో పెన్షన్‌దారులను విచారణ చేస్తున్న వైద్యులు, అధికారులు

ధాన్యం కొంటారా...?

- మొదలుకాని ధాన్యం కొనుగోళ్లు
- ఎమ్మెల్యే చొరవ చూపినా ఆలస్యమే!
- అన్నదాతల ఎదురుచూపు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నదాతలకు అండగా నిలిచింది. గత ఏడాది వైసీపీ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇతర జిల్లాల్లో ప్రక్రియ సజావుగా సాగుతూ కీలకదశకు చేరుకున్న తరుణంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రాంతంలో ఇప్పటికీ కొనుగోలు ప్రక్రియ మొదలుకాలేదు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రత్యేక చొరవ చూపినా అనివార్య కారణాలతో అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో అన్నదాతలు మద్దతు ధర కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగానే సాగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఎకరాకు సగటు 33 నుంచి 38 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు వచ్చాయి. నియోజకవర్గంలో ఒక్క ప్రొద్దుటూరు మండలంలో 3,700 ఎకరాల్లో వరి సాగైంది. రాజుపాళెం మండలంలో 2,500 ఎకరాల వరకు రైతులుసాగు చేశారు. వరి కోత దశ చేరిన సమయంలో నవంబరు, డిసెంబరు నెలల్లో చోటు చేసుకున్న వాతావరణ మార్పులు, రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. వరుస అల్పపీడనాలతో కోత దశలోని వరిపైరు అతలాకుతలం అయింది. పంట తడిసి నీటమునిగి రైతులు నానా తంటాలు పడ్డారు. చేతికొచ్చిన పంటను ఆరబెట్టుకునేందుకు నిలువ ఉంచుకునేందుకు తగిన సౌకర్యం లేక గిట్టుబాటు ధర లేకపోయినా విధి లేని పరిస్థితుల్లో ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నారు. ఇదే అదునుగా తేమ శాతం అధికంగా ఉందని, 78 కిలోల బస్తాకు రూ.1300 నుంచి రూ.1400 చెల్లించి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు లేకుండా దోపిడీకి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో చేతికందిన దిగుబడిని ఎక్కడ దాచిపెట్టాలో, ఎవరికి అమ్ముకోవాలో తెలియని ఆందోళనకు అన్నదాతలు గురయ్యారు. వర్షాల ప్రభావంతో కోతలను వాయిదా వేసుకుని ఆలస్యంగా యంత్రాల సహాయంతో నూర్పిళ్లు ప్రారంభించారు. కూలీల చేత పంట కోత ఆలస్యం అవుతుండడం, కూలీల కొరత ఉండడం, అధిక వ్యయాలతో యంత్రాలపై ఆధారపడి పంటను సాగు చేసుకునే చర్యల్లో నిమగ్నమయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో...

ఒకవైపు వరుస అల్పపీడనాలు, వర్షాలు, మరోవైపు సరైన గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతన్నకు అండగా నిలిచేందుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవ చూపి జిల్లా వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల అధికారులతో చర్చించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రొద్దుటూరులోనే ధాన్యం కొనుగోలు చేసేలా ఒప్పించారు. ఎట్టకేలకు డిసెంబరు 23వ తేదీ నుంచి ప్రొద్దుటూరులోనే కొనుగోలు ఏర్పాటు చేయనున్నట్లు రైతుల వద్దకు వెళ్లి ఎంఎస్‌పీ రేటు ప్రకారం క్వింటా రూ.2,300 ధరతో సివిల్‌సప్లై అధికారులు కొనుగోలు చేస్తారని వ్యవసాయాధికారులు ప్రకటించారు. అన్నదాతలు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఈ కేంద్రాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే సాంకేతిక పరమైన అనుమతులు అందక, మిల్లుల నుంచి ఏర్పడిన సమస్యల కారణంగా కొనుగోలు ప్రారంభం తేదీ వాయిదా పడింది. సమస్యలు తొలగి అధికారుల నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తాయోనని రైతన్నలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.


కానపల్లెలో రైతులు ఆరబెట్టిన ధాన్యం

త్వరలో కొనుగోలు చేస్తాం

అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అతి త్వరలో చేపడతాం. మిల్లర్ల వద్ద నుంచి బ్యాంకు గ్యారెంటీలు అందడం ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం.

-అర్జునరావు, డీఎం, పౌరసరఫరాల సంస్థ

గిట్టుబాటు లేకపోయినా...



అల్పపీడనాలతో ధాన్యం తడిసి నష్టాల భయంతో 78 కిలోల బస్తా రూ.1400 చొప్పున ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నాను. అధికారుల నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడకపోవడంతో గిట్టుబాటు ధర లేకపోయినా అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

- ఏటూరి సుధాకర్, చెంచుపల్లె గ్రామం

ధర నచ్చక...



ప్రైవేటు మిల్లర్ల యజమానులు చెప్పే ధర నాకు నచ్చలేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు వారు చెప్పే రేటు గిట్టుబాటు కావడం లేదు. ధాన్యం ఎండబెట్టి ఇంటి వద్దనే నిలువ ఉంచాను. సరైన ధర వచ్చినప్పుడు అమ్ముతాను.

- కె.వెంకటసుబ్బయ్య, కానపల్లి

నైపుణ్య శిక్షణతో మంచి ఫలితాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు


- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమమైన ఉపాధి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్కిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున, కమిటీ సభ్యులందరూ జిల్లాలో నైపుణ్య శిక్షణల గురించి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంకల్ప స్కీంతో జిల్లాలో చేపట్టాల్సిన నైపుణ్య కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులదరికీ వివరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యక్రమం గురించి కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చించారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి, సభ్యులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ కరపత్రాలను కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, డీఆర్‌ఓ, మెప్మా పీడీలు, జేడీ అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, లీడ్ బ్యాంకు మేనేజర్, రాయచోటి మున్సిపల్ కమిషనర్, కమిటీ సభ్యులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు

జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కృష్ణ వెల్లడి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జేడీ, యూనియన్ నేతలు

రాయచోటి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు కృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన-2025 సంవత్సరపు క్యాలెండర్‌ను చేనేత, జౌళి శాఖ జిల్లా సమాయ సంచాలకులు కృష్ణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికులకు ఇలాంటి సంఘాల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. 34 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి, చేనేత రంగ రక్షణకు చేనేత కార్మిక యూనియన్ నాయకులు పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను మా శాఖ ద్వారా సక్రమంగా అమలు చేస్తామని, చేనేత కార్మికులకు ఏదైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే మమ్మల్ని నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

సమావేశంలో చేనేత, జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి వెంకటకుమార్, ప్రవీణ్‌కుమార్‌రాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంమోహన్, రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు గుంపు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోడెం వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిశెట్టి తిరుమలేశ్, తంబళ్లపల్లె అధ్యక్షుడు అనంత ఈశ్వరయ్య తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల మృతి

ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు.. పొలంలో గుండెపోటుతో మరొకరు


తలారి సుబ్బమ్మ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటనలు పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగాయి. ఆయా కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులికల్లు గ్రామానికి చెందిన తలారి బావన్న భార్య తలారి సుబ్బమ్మ (65) సోమవారం ఉదయం బహిర్భూమికి ఆరు బయటికి వెళ్లి వస్తూ కిందపడిపోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆమె మృతి చెందినట్లు తెలియచేశారు. అదే విధంగా మండలంలోని రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లెకు చెందిన జగడం క్రిష్ణమూర్తి భార్య జగడం కళావతమ్మ (55) సోమవారం మధ్యాహ్నం తమ కుటుంబ సభ్యులు పొలం పనులు చేస్తుండగా వారికి భోజనం తీసుకెళ్లింది. పొలం వద్దకు చేరుకోగానే ఉన్నట్టుండి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయింది గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా వాహనం అక్కడకు చేరుకుంది అప్పటికే ఆమె మృతి చెందినట్లు సిబ్బంది తెలియ చేశారు. మృతురాలికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.

ప్రజల ఫిర్యాదులను అలక్ష్యం చేయొద్దు


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా వెంటనే వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారికి మాట్లాడి సమస్యలను తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సమస్యలపై విన్నవించుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్స్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఆ ఫిర్యాదులపై కూడా సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



ఒంటిమిట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గంగపేరూరుకు చెందిన దూల సుబ్బారెడ్డి (57) వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు.

వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక పోవడంతో రెండు రోజుల క్రితం పొలం వద్ద షెడ్డులో పురుగుల మందు తాగాడు, అపస్మారక స్థితిలో పడిపోయిన అతనిని బంధువులు కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.





ములకలచెరువు గజ..గజ...

- ఉదయం 10 గంటల వరకు కప్పేసిన పొగమంచు

ములకలచెరువు, జనవరి 6: ములకలచెరువును సోమవారం పొగమంచు కప్పేసింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ పొగమంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వణికిపోయారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచుతో ఎదురుగా వచ్చిన వాహనాలు కన్పించకపోవడంతో లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు.


పొగమంచులో జాతీయ రహదారి

శ్రీగంధం సాగు.. ఆదాయం బాగు...

- గతంలో పొలాల గట్లపై...
- స్మగ్లర్లతో అంతరించిన వైనం
- మళ్లీ సాగు చేస్తున్న రైతులు
- కోడూరు నుంచి ఏడాదికి 6 లక్షల మొక్కల ఎగుమతి

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీగంధం చెట్ల సాగుతో మంచి ఆదాయం గడించవచ్చని కొందరు రైతులు వీటి సాగు పట్ల మక్కువ చూపుతున్నారు. గతంలో రైతులు తమ పొలాల గట్ల పైన వీటిని నాటుకునే వారు. అయితే స్మగ్లర్లు వాటిని నరికివేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. దీంతో శ్రీగంధం చెట్లు లేకుండా అంతరించిపోయాయి. అయితే వీటిని మళ్లీ రైతులు సాగు చేస్తున్నారు. శ్రీగంధం చెట్టు పెద్దగా లావు ఉండదు. సుమారు 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. శ్రీగంధం బెరడు, పుల్లలు, కాండం తదితరాలు పనికి వస్తాయి. ఒక్క శ్రీగంధం చెట్టు బాగా పెరగడానికి సుమారు 25 ఏళ్ల సమయం పడుతుంది. పుల్లలు, కాండంలను ముక్కలుగా కట్ చేసి ఆయిల్ తీస్తారు. బెరడు నుంచి వచ్చిన పౌడర్‌ను సోప్స్ పరిశ్రమలకు పంపిస్తారు. శ్రీగంధం నుంచి తీసిన ఆయిల్ ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాల్లో దానిని కలుపుతారు.

దేశంలోని కోల్‌కత్తా, బెంగళూరు, హరియానా, కొవ్వూరు ప్రాంతాల్లో శ్రీగంధం పరిశ్రమలు ఉన్నాయి. ఎక్కువగా శ్రీగంధం మొక్కలు తెలంగాణ, మైసూరు, గుంటూరు, ప్రకాశం, ఒరిస్సా తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఒక్క శ్రీగంధం మొక్క 20 రూపాయలకు రైల్వేకోడూరు నర్సరీల్లో విక్రయాలు చేస్తున్నారు. టన్ను శ్రీగంధం చెక్కలు రూ.7 లక్షలు ధర ఉంది. వీటికి విపరీతంగా డిమాండ్ ఉంది. నాణ్యత గల ఆయిల్ కిలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. ఎకరా పొలంలో శ్రీగంధం సాగుకు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అవుతుంది. మొదట ఖర్చు ఎక్కువగా అనిపించినా రాను రాను ఖర్చు తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఎకరాకు 500 మొక్కలు పడతాయి.


రైల్వేకోడూరు నర్సరీలో శ్రీగంధం మొక్కలు


రైల్వేకోడూరు మండలంలో సాగవుతున్న శ్రీగంధం చెట్లు

ఇతర దేశాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది. రైల్వేకోడూరులో 11 ఏళ్ల నుంచి వివిధ నర్సరీల వ్యాపారులు మొక్కలను పెంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. 2011 నుంచి కరోనా సమయం వరకు ప్రతి ఏడాది 6 లక్షల మొక్కలను ఎగుమతి చేశారు. కరోనా తర్వాత ప్రతి ఏటా లక్ష మొక్కలను ఎగుమతి చేశారు. ప్రస్తుతం మళ్లీ వ్యాపారం పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో సుమారు 50 ఎకరాల్లో శ్రీగంధం మొక్కలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటను కాపాడుకోవాలి. స్మగ్లర్ల భయం ఎక్కువగా ఉంటుంది. స్మగ్లర్ల కంటికి కనిపిస్తే చాలు నరికివేసి వాటిని తరలిస్తారు. కాబట్టి జాగ్రత్తగా ఈ పంటను కాపాడుకుంటే మంచి లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఎర్రచందనం కంటే ఎక్కువగా డిమాండ్ కల్గింది శ్రీగంధం. వివిధ కంపెనీలకు చెందిన శాండల్ ఉడ్ సోప్స్ మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఎక్కువగా మైసూరులో తయారు చేసే శాండల్ సోప్స్‌ల్లో శ్రీగంధంను వినియోగిస్తున్నారు. ఇలాంటి ఆదాయం వచ్చే శ్రీగంధం సాగును రైతులు మరింత చేపడితే లాభాలు పొందవచ్చు. ఎకరాకు ఆదాయం సుమారు రూ.కోటి వస్తుందని అంచనా. నియోజకవర్గంలో రైతులు శ్రీగంధం సాగుపై ప్రస్తుతం రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.

ఆదాయం ఉందని సాగు చేస్తున్నాము

శ్రీగంధం సాగులో ఆదాయం బాగా ఉందని సాగు చేపట్టాము. ఇప్పటికి ఏడాది అయింది. మొదట ఖర్చు ఎక్కువగా వచ్చినా తర్వాత సాగుకు ఖర్చు తగ్గింది. సాగులో ఎలాంటి ఇబ్బంది లేదు. స్మగ్లర్ల భయం తప్ప మరేది లేదు. శ్రీగంధంకు మంచి డిమాండు ఉంది. ధర కూడా బాగా ఉంటుంది.

- చంగ్రలాయుడు, రైతు, రైల్వేకోడూరు

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం చేపడుతున్నాము. అటవీశాఖ నర్సరీలో పెంపకం చేస్తాము. రైతులకు ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తాము. ఇందుకు ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. అనుమతి రాగానే మొదలు పెడతాము.

- శ్యాంసుందర్, రేంజర్, రెల్వేకోడూరు

ఉద్యానపంటలపై రైతుల ఆసక్తి

- పోరుమామిళ్ల డివిజనులో 7వేల ఎకరాల్లో సాగు
- రైతులకు ప్రోత్సాహకంగా రాయితీలు
- కొత్తగా రాయితీలు పొందాలంటే.. దరఖాస్తు చేసుకోవాల్సిందే..

పోరుమామిళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల డివిజనులో రైతులు ఉద్యానపంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల్లో అరటి, దానిమ్మ, మామిడి, తైవాన్ జామ, బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తూ దాదాపు 7వేల ఎకరాల్లో సాగు చేశారు. పోరుమామళ్ల మండలంలో నాగలకుంట్ల, పుల్లీడు, బొప్పాపురం, రజాసాహెబ్‌పేట, అక్కల్‌రెడ్డిపల్లె, కవలకుంట్ల, రంగసముద్రం, గురప్పగారిపల్లె ప్రాంతాల్లో ఎక్కువగా బొప్పాయి, దానిమ్మ, తైవాన్‌జామ వంటి పంటలు సాగు చేశారు. సిద్దవరం సమీపంలో కొండుగారిపల్లె, చెన్నారెడ్డిపేట ప్రాంతాల్లో కూడా ఎక్కువగా తైవాన్ జామ, దానిమ్మ పంటలను సాగు చేశారు. నాలుగు మండలాలకు సంబంధించి దాదాపు 7వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. అరటి 1694 హెక్టార్లలో, బత్తాయి 409, ఆయిల్‌పాం 354, మామిడి 311, నిమ్మ 297, జామ 285, పసుపు 270, కొబ్బరి 275, టమోటా 245, తమ లపాకు 120, దానిమ్మ 104, సీతాఫలం 52, నన్నారి 39, డ్రాగన్‌ఫ్రూట్ 13, రేగుపండ్లు 61, రోజాపూలు 112, నేరేడు 11హెక్టార్లలో సాగయ్యాయి.

ఉద్యాన పంటలకు రాయితీలు ఇలా...

దానిమ్మ, జామ, బత్తాయి, నిమ్మ వంటి ఉద్యాన పంటల సాగు చేపట్టే రైతులకు మొక్కల పెంపకానికి ఖర్చులో దాదాపు 40 శాతం రాయితీ అందిస్తున్నారు. మామిడికి సంబంధించి హెక్టారుకు 178 మొక్కలకు రూ.13400, జామ 1111కు 29301, దానిమ్మ 667కు 26672, బత్తాయి నిమ్మ 278కు 16004, అంజీరా 625 మొక్కలకు 30వేలు, ఉసిరి 150కి 18వేలు, ఆవకాడో 425 మొక్కలకు రూ.18వేలు, వాక్కాయ 2500 మొక్కలకు 18వేలు వంతున ఇస్తారు. టమోటా, వంకాయ, కాకర లాంటి కూరగాయల పంటలను ఆధునిక సాంకేతికంగా పేపరు వేసి లేదా కట్టెలు కట్టి సాగు చేపడితే హెక్టారుకు ఒకటికి రూ.20వేలు ఆర్థిక సాయం అందుతుంది. వివిధ రకాల ఉద్యానపంటలను మల్చింగ్ లేదా పేపరు వేసి సాగు చేస్తే హెక్టారు ఒకటికి రూ.16వేలు రాయితీ అందజేస్తారు. సాగునీటి వనరులను రైతులు నిల్వ చేసుకుని పంటలు వాడుకోవడానికి పంట పొలంలో నీటి కుంటలు 20 ఇంటు 20 ఇంటు 3 ఘన మీటరులో ఏర్పాటు చేసుకుంటే రూ.75వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. రైతు పండించిన ఉద్యా న ఉత్పత్తులన్నీ గ్రేడింగ్ చేసి నేరుగా పొలం నుంచి మార్కెట్‌కు తరలించడానికి పొలంలో ఫామ్ హౌస్ నిర్మించుకుంటే రూ.2 లక్షలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారు. కూరగాయ, ఉద్యాన పంటల నారు పెంపకం మార్కెట్ అధిక డిమాండ్ ఉండి పూలు, కూరగాయల సాగు చేపట్టిన పాలిహౌస్ షెడ్డు నిర్మాణానికి ఎకరాకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అన్ని ఉద్యానపంటలకు 70 నుంచి 90 శాతం వరకు రాయితీ వరకు డ్రిప్ మరియు తుంపర పరికరాలను నీటి వసతి ఉన్న ప్రతి రైతుకు అందిస్తున్నారు. జామ, దానిమ్మకు, బొప్పాయి, అరటి పంటలపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తుండడంతో ఈ ప్రాంతంలో ఉద్యానపంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఉద్యానపంటల రాయితీలపై ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి వివరణ కోరగా, గత ఏడాదికి సంబంధించి రైతులకు రాయితీలు అందాయని, ఈ ఆర్థిక సంవత్సరానికి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామని తెలిపారు.


నాగులకుంట్లలో బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసరెడ్డి


మల్చింగ్ పద్ధతిలో ఉద్యానవన పంటల సాగు


డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అరటి సాగు చేసిన దృశ్యం


ఉద్యానపంటలకు రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలు

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపండి


ఆర్టీసీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

కడప మారుతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపాలని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి గంగాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో సుమారు 8 వేల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని.. వీరందరికీ జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా బ్యాంక్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించేలా చూడాలన్నారు. విధుల్లో వుండే కార్మికుడికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే సంబంధిత ఆర్టీసీ డిస్పెన్సరీ హాస్పిటల్‌లో వైద్యం అందేలా చూడాలన్నారు. ఇందుకు చైర్మన్ స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ కోశాధికారి పి.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షుడు గజపతి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఈ డీఈఓ మాకొద్దు

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి


ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినేవిధంగా డీఈఓ మీనాక్షి ప్రవర్తిస్తున్నారని.. తక్షణం ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే మూకుమ్మడిగా క్యాజువల్ లీవ్ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కడప ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం లేని.. ఉపాధ్యాయులు, లెసన్ ప్లాన్ అంటే తెలియని డీఈవోని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడే విధానాన్ని వివరించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వెంకటశివారెడ్డి, రామమూర్తి, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష, ఖాదర్ బాష, కొండారెడ్డి, లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, అబ్దుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో పట్టపగలే చోరీ


బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

రాజంపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో పట్టపగలే ఇంటి తలుపులు పగులగొట్టి 15 తులాల బంగారం, నగదు చోరీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగరాజు, లక్ష్మి సోమవారం విధులకు వెళ్లి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడం గమనించా రు. పడక గదిలో ఉన్న బీరువాలోని 15 తులాల బంగారం, నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. రాజంపేట మన్నూరు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ మహ్మద్‌అలీ, హెడ్‌కానిస్టేబుల్ నందకుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



చక్రాయపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన సోమవారం కట్టెల ట్రాక్టర్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే .... బొగ్గలబట్టీ కోసం చక్రాయపేట నుంచి వేంపల్లె వైపు ట్రాక్టర్ కట్టెలు వేసుకొని వెళ్తుండగా మారెళ్లమడక బస్‌స్టాప్ వద్ద వేగం అదుపుకాక రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డులో బోల్తాపడింది. అప్పుడే ఆర్టీసీ బస్ వస్తుండగా డ్రైవర్ చాకచక్యంతో తప్పించడంతో ప్రమాదం జరగలేదు. కానీ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. హైవే కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మేకలు మేపుకోవడానికి వెళ్లి వ్యక్తి అదృశ్యం

సికెదిన్నె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మేకలు మేపుకోవడానికి వెళ్లిన బ్రహ్మయ్య అనే వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని.. కుటుంబ సభ్యులు సికెదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం పెద్ద కాంపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మయ్య మూడు రోజుల క్రితం రోజుమాదిరిగానే మేకలు మేపుకోవడానికి కొండప్రాంతానికి వెళ్లాడు. అయితే మేకలు తిరిగి ఇంటికి వచ్చినా బ్రహ్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీకోసం అనేక చోట్ల గాలింపు చర్యలు చేపట్టినప్పటికి కనిపించలేదు. దీంతో సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

బి.కొత్తకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన సంజీవరాజు(46) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 16 ఏళ్ల క్రితం తనభార్య చనిపోవడంతో పాటు, 10 ఏళ్ల నుంచి వాయిసంబంధిత(ఫిట్స్)తో బాధ పడుతున్న సంజీవరాజు జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా సంజీవరాజు మరణ వార్త తెలియగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు గోపాళ్యం హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జవన్‌గంగాధర్ బాబు పేర్కొన్నారు.

భూ వివాదంలో తమ్ముడిపై అన్న దాడి


గాయపడిన తమ్ముడు శంకర

నిమ్మనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తండ్రి సంపాదించిన ఆస్తిని పంచుకొనే క్రమంలో తోడ బుట్టిన తమ్ముడిపై కొడవలితో అన్న దాడి చేసిన సంఘటన చోటు చేసుకొంది. మండంలోని ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెకు చెందిన చెంఢ్రాయప్ప కుమారుడు శంకర(45)కు అతని అన్న గుర్రప్పకు ఆస్తి విషయంలో తగాదా ఉంది. ఈ నేపథ్యంలో శంకర ఆదివారం రాత్రి బహిర్భూమికి పెద్దవంక వద్దకు వెళ్లగా అప్పటికే కాపుకాచి ఉన్న అన్న గుర్రప్పతో పాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కొడవళ్లతో దాడి చేశారు. దీంతో శంకర కేకలు వేయడంతో గ్రామస్తులు రాగా.. గుర్రప్పతో పాటు ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన శంకరను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రప్పపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

రీసర్వేపై రైతులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలి

- డీఎస్ఎల్‌వో కె.మురళీక్రిష్ణ



శివాలపల్లెలో రీసర్వేపై అవగాహన ర్యాలీ

చెన్నూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 నుంచి చేపడుతున్న రీసర్వేపై రైతులు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలని జిల్లా భూసర్వే అధికారి కె.మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామాన్ని రీసర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. సోమవారం గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో మాట్లాడుతూ రీసర్వే ఎలాంటి వివాదాలు ఆరోపణలకు అవకాశం లేకుండా నిర్వహించాలన్నారు. ప్రతి రైతు ఈ రీసర్వే వల్ల తన భూమిపరంగా పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు ప్రతి రైతుకు సమాచారం అందాలని.. తద్వారా రైతులు తమ భూముల వద్ద ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండల అధికారులతో సమావేశం నిర్వహించి రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఈ నెల 9న గ్రామసభ నిర్వహించాలని ఆ సభకు రైతులు, ప్రజలు తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు సోమశేఖర్, సర్వే డీటీ అర్చన, డీటీ వెంకటరమణ, ఆర్‌ఐ కౌశిక్, వీఆర్వో వెంకటసుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు శివారెడ్డి, తేజా, ఆరిఫ్, రామచంద్ర, పవన్ పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వహణ చట్టరీత్యా నేరం : జేసీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా వినతుల పరిష్కార వేదికలో కోడి పందేలు నిర్వహించుట చట్టరీత్యా నేరం అనే గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహించుట జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, మరియు సెక్షన్ 1/1974 ప్రకారం చట్టరీత్యా నేరమన్నారు. అందులో పాల్గొన్న వారితో పాటు ఏ స్థలంలో నిర్వహిస్తారో వారికి కూడా వర్తిస్తుందన్నారు. కోడి పందేలు నిర్వహించే వారు 144 సీఆర్‌పీసీ ప్రకారం శిక్షార్హులు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.శారదమ్మ, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అధికారులు వెంకటరమణయ్య, లీలా స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గుంతలు పూడ్చుతున్నారు

- ప్రయాణికులకు కాసింత ఊరట
- జిల్లా సరిహద్దు నుంచి రోడ్డు పనులు ప్రారంభం


రైల్వేకోడూరు మండలం కుక్కలదొడ్డి వద్ద నుంచి రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట-రేణిగుంట రోడ్డులో గుంతలతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడేవారు. గుంతలను తప్పించబోయి ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా చాలా మంది గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు-తిరుపతి, రాజంపేట-రైల్వేకోడూరు వైపు ప్రధాన రహదారి గుంతలు పడి పూర్తి స్థాయిలో దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తోంది. సోమవారం రైల్వేకోడూరు-తిరుపతి సరిహద్దు నుంచి ప్రధాన రహదారిలో పనులను నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రారంభించారు. గుంతలను పూడ్చి తారు రోడ్డు వేస్తున్నారు.

అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- తొలి మ్యాచ్‌లో సత్తా చాటిన కడప, చిత్తూరు జట్లు


తాహీర్(కడప) 54 నాటౌట్, ధనుష్ (చిత్తూరు) 110 పరుగులు, లిఖిత్ ఇరగంరెడ్డి (చిత్తూరు) 99 పరుగులు

కడప స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలనే ధ్యేయంతో వివిధ టోర్నమెంట్స్ కడపలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ వెల్లడించారు. ఆ మేరకు ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు కడపలో ఏసీఏ అండర్-12 బాలుర అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి.

36 పరుగులతో కడప జట్టు విజయం

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగిన మొదటి మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇందులో తాహీర్ 54 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టు 31 పరుగులతో విజయం సాధించింది.

165 పరుగుల తేడాతో చిత్తూరు ఘన విజయం

కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్దీత 35 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో ధనుష్ 110 పరుగులు చేయగా.. లిఖిత్ ఇరగంరెడ్డి 99 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 22 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. దీంతో చిత్తూరు జట్టు 165 పరుగుల భారీ స్కోర్ తేడాతో విజయం సాధించింది.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కుప్పం పర్యటనకు వెళ్లే ముందు సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తోంద న్నారు.

యువకుల ఘర్షణ

నందలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందలూరులో ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆటలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో గాయపడిన కరీముల్లా అనే యువకుడిని కడప రిమ్స్‌కు తరలించారు. దాడికి పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిద్దవటం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని బండి కనుమ రహదారి వద్ద ఆదివారం సాయంత్రం ఇన్‌ఛార్జి మండల ఎస్‌ఐ శివప్రసాద్ పట్టుకున్నారు. చలమారెడ్డిపల్లెకు చెందిన చల్లా సుధాకర్ టక్కోలి సమీపంలోని పెన్నానదిలో ఇసుక లోడ్ చేసుకొని కడపకు తరలిస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకుని, మండల తహసీల్దారుకువాహనాన్ని అప్పజెప్పామని ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

రహదారి మరమ్మతు పనులు వేగవంతం

సిద్దవటం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వెంకటాయపల్లె ఆర్ అండ్ బీ రోడ్డులో గుంతల పూడ్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం ఆర్ అండ్ బి ఏఈ గంగిరెడ్డి మాట్లాడుతూ జ్యోతి వెంకటాయపల్లె ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతు పనులు మార్చి లోగా, పూర్తవుతాయని సిద్దవటం ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో నిర్వాసితులకు త్వరలో పరిహారం చెల్లిస్తామన్నారు. మాచుపల్లె, ఖాదర్ బంగ్లా వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని తెలిపారు.

సీఎంను కలిసిన గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడును రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ముందు చూపుతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రజలు నీరాజనాలు పడుతున్నారన్నారు.

గోకులాల పరిశీలన

రామాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న గోకులాలను ఏపీవో పెంచలయ్య, ఈసీ శివయ్య సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పథకం కింద మండలానికి 74 గోకులాలు మంజూరయ్యాయని, అందులో 39 పూర్తి కాగా మిగిలిన వాటిలో 14 బేస్‌మెంట్ లెవెల్, 16 రూఫ్ లెవెల్‌లో ఉన్నట్లు తెలిపారు. ఒక్కొక్క గోకులానికి రూ. 2.30 లక్షలు మంజూరు చేశామన్నారు.

సమస్యల గుట్ట.. గంగిరెడ్డుల మిట్ట

- నేటికీ రోడ్డు లేని దుస్థితి..
- అంబులెన్స్, రేషన్ వాహనం ఊసే లేదు..
- మూడు కిలోమీటర్లు నడిచి వెళితేనే రేషన్..
- ఎన్నికల సమయంలో నేతలు ఇచ్చిన హామీలు గాలికి..
- కూటమి ప్రభుత్వంలోనైనా పరిస్థితి మారేనా?



గంగిరెడ్డుమిట్ట గ్రామం

రైల్వేకోడూరు రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తయినా ఇప్పటికీ పలు గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదనడానికి గంగిరెడ్డులమిట్ట సాక్ష్యంగా నిలుస్తోంది.

మండలంలోని చియ్యవరం గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డులమిట్టలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి వెళ్లాలంటే సీ.వడ్డీపల్లి వద్ద ఉన్న పొలాల్లో నుంచి కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. లేదా, చియ్యవరం గ్రామానికి వెళ్లే మార్గంలోని రాళ్ల వంక దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండు దారులు తాత్కాలికమే. వర్షాలు కురిసి వంకలో నీరు ప్రవహిస్తున్నా , పొలాల్లో నుంచి వెళ్లకుండారైతులు అడ్డుకున్నా గ్రామానికి వెళ్లేందుకు మరోదారి లేదు. ఆరోగ్య సమస్య వస్తే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ తెచ్చుకోవాలన్నా, పిల్లలు బడికి వెళ్లాలన్నా వంక దాటాల్సిందే. గ్రామంలో మౌలిక వసతులు అంతంత మాత్రమే. ఇప్పటికైనా గ్రామ సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని స్థానికులు వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ రాతలు మారుతాయేమోనని ఆశగా ఎదురుచుస్తున్నారు.



రేషన్ సరుకులతో వంక దాటుతున్న గ్రామస్తులు

రేషన్ కావాలంటే వంక దాటాల్సిందే..

మా గ్రామానికి రేషన్ వాహనం రాదు. మేమే వంక దాటి వెళ్లి రేషన్ దుకాణం వద్ద సరుకులు తెచ్చుకుంటాం. గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వ అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

- శ్రీనివాసులు, గంగమ్మ

అంబులెన్స్ కూడా రాదు...



మా గ్రామంలోకి అంబులెన్స్ వాహనం వచ్చే పరిస్థితి లేదు. అత్యవసర పరిస్థితుల్లో మోటర్ బైకుపై రోగులను ఆసుపత్రికి తరలిస్తున్నాం. ఆరోగ్య సమస్యలు ఉంటే ఎనిమిది కిలోమీటర్లు ఉన్న కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే నాయకులు గెలిచిన తరువాత కనపడరు. మా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

- విజయమ్మ

తిమ్మారెడ్డికుంట ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పెద్దివీడు గ్రామస్తులు

వీరబల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంఘంవారిపల్లె పంచాయతీ లోని తిమ్మారెడ్డికుంట ఆక్రమణపై సోమవారం స్పందన కార్యక్రమంలో పెద్దివీడు గ్రామస్తులు ఈశ్వర్‌రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ కుంట మెయిన్ రోడ్డుకు సమీపంలో ఉండడంతో వైసీపీకి చెందిన వ్యక్తి గుడి పేరిట ఆక్రమించారన్నారు. తన పేరుతో భూమి ఉందంటూ అప్పటి తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డితో పట్టా చేయించుకుని పక్కనే ఉన్న తిమ్మారెడ్డికుంట భూమి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ భూమికి కంచె వేయడంతో ప్రస్తుతం అటువైపు ఉన్న భూములకు వెళ్లేవారికి, పశువుల మేతకు వెళ్లడానికి వీలు లేకుండా పోయిందన్నారు. రికార్డులు పరిశీలించి తిమ్మారెడ్డికుంట కు హద్దులు చూపాలని, భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

'అద్దె బకాయిలు చెల్లించే వరకు పోరాటం'

రాయచోటి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె మండలాల్లోని అంగన్వాడీ సెంటర్లకు 9 నెలలుగా అద్దె చెల్లించని ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంగ్ భాగ్యలక్ష్మి జిల్లా కోశాధికారి బంగారుపాప మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్యకర్తలు కూరగాయలు, గ్యాస్ కోసం అప్పులు చేస్తూ అంగన్వాడీ సెంటర్లను నెట్టుకువస్తున్నారన్నారు. అద్దె బకాయిలు చెల్లించే బాధ్యత ప్రభుత్వం గానీ, అధికారులు గానీ తీసుకోకపోతే ఈ నెల 11న పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు స్పందించిన సీడీపీవో శశికళ ప్రస్తుతానికి నాలుగు నెలల బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

జాతరలో దుకాణాల ఏర్పాటు హక్కులకు 10న వేలం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మజాతరలో తల నీలాల సేకరణ, కొబ్బరికాయల విక్రయం, టోల్‌గేట్ వసూలు హక్కులకు ఈ నెల 10 వ తేదీన ఉదయం 10 గంటలకు అనం తపురం గంగమ్మ ఆలయంలో వేలం నిర్వ హిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధి కారి శ్రీనివాసులు తెలిపారు.ఈ నెల 6న నిర్వహించాల్సిన వేలం అనివార్య కారణా ల వల్ల 10వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేల ధరావతు చెల్లించాలన్నారు. హక్కులు దక్కించుకున్నవారు సగం మొత్తం వెంటనే చెల్లించాలని, మిగిలిన మొత్తం 10 రోజుల్లో చెల్లించాలన్నారు.

రసాయన రహిత ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాల యాల ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రసాయన రహిత ఉత్పత్తుల అమ్మకాల కోసం స్టాల్ ఏర్పాటు చేశారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా మండలానికి చెందిన పలువురు ప్రజలు మండల పరిషత్ కార్యాలయానికి వస్తారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంసీఎం బుల్లయ్య తెలిపారు. ఆర్‌ఐ రా మ్మోహన్, సర్వేయర్ నాగ లక్ష్మి, అధికారులు, ఐసీఆర్‌పీ గురువులు పాల్గొన్నారు.

నందలూరు: స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల దుకాణం ఏర్పాటు చేశారు. యూనిట్ ఇన్‌చార్జి కృష్ణయ్య, డివిజనల్ మోడల్ మేకర్ పుష్ప, ఐసీఆర్‌పీలు విజయకుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

రాజంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రిన్సిపల్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. డాక్టర్ పి.అనిత, ఎ.సుష్మిత, ఎం.చక్రపాణి పర్యవేక్షించారు. డ్యాన్సుల్లో, పాటల్లో, రంగవల్లుల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల అధినేత చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ సి.రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక పెన్షన్లపై క్షేత్రస్థాయి విచారణ



విచారణ చేస్తున్న డాక్టర్ల బృందం

ఒంటిమిట్ట,జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పెన్షన్లపై సోమవారం డాక్టర్ల బృందం క్షేత్రస్థాయిలో వి చారణ చేసింది. మంచానికే పరిమి తమై లేవలేని స్థితిలో ఉన్నామని దరఖాస్తు చేసుకున్న పది మంది ఇళ్లవద్దకు వెళ్లి పరిశీలించారు. పెరా లసిస్, ఇతర సమస్యలతో లేవలేని స్థితిలో ఉన్నామని డీఎంహెచ్‌ఓకు దరఖాస్తు చేయడంతో మండలంలోని పది మందికి పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. ఈ బృందంలో డాక్టర్ మహేందర్ రెడ్డి, ఉజ్వల, డాక్టర్ హైలెందర్‌సింగ్, తదితరులు ఉన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వివరాలు తెలియజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



లక్కిరెడ్డిపల్లెలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మౌర్యరెడ్డి

లక్కిరెడ్డిపల్లె/చిన్నమండెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి); యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని రాయచోటి టీడీపీ యువ నాయకుడు మౌర్యరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కోనంపేట తోపాటు చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్లను ఆయన ప్రారంభించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పేరంపల్లి పంచాయతీలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులకు యూనిఫాం దుస్తులు అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, కసిరెడ్డి శివారెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఏఐఎల్ డైరీ న్యాయవాదులకు ఉపయోగకరం

రాజంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఏఐఎల్ నూతన డైరీ న్యాయ వాదులకు ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర ఐఏఎస్ కార్యవర్గ సభ్యుడు పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఐఏఎల్ 2025 నూతన డైరీ న్యాయవాదులకు, పోలీసులకు, కోర్టు సిబ్బందికి, గుమస్తాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కోర్టు వాయిదాలు పోస్టింగ్ వేయడానికి ఉపకరిస్తుందని వివరించారు. రాజంపేట బార్ అసోసియేషన్‌లో నూతన డైరీ, క్యాలెండర్‌లను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ నాసరుద్దీన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఐఏఎస్ అధ్యక్షుడు ముజఫర్ అహ్మద్ అధ్యక్షత వ హించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గిరి చంద్రారెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డి, కేవీ రమణ, రమేష్‌నాయుడు, డి.నరసింహులు, ఆర్.ప్రభాకర్ రావు, వెంకటసుబ్బయ్య, కత్తి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ బెరైటీస్ టెండర్ సరైనదే..

- లారీ ట్రాలీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బెరైటీస్ విక్రయాలకు ఏపీఎండీసీ పిలిచిన టెండర్ సరైనదేనని లారీ ట్రాలీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం. జైహింద్‌రెడ్డి, జీ. మధు, ఎల్‌జీఆర్ మధు, జి. మణి, జి. వంశీ తెలిపారు. సోమవారం వారు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెండర్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు కారణంగా దాదాపు 5 నుంచి 6 వేల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. మంగంపేట స్టాకు పాయింట్ నుంచి మిల్లులు, ఎగుమతిదారుల స్టాక్ యార్డులకు, కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు తరలించి జీవిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కేవలం లక్ష మెట్రిక్ టన్నుల ఏ-గ్రేడ్, 5 లక్షల మెట్రిక్ టన్నుల బీ-గ్రేడు రాయి మాత్రమే అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీంతో తాము సీ-గ్రేడు ముగ్గురాయి అమ్మకాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని చిరు వ్యాపారులు, కార్మికులు, ఎక్స్‌పోర్టర్లకు న్యాయం జరిగేలా ప్రస్తుత టెండర్ కొనసాగించాలని కోరారు. మంగంపేట ఖనిజాన్ని తమ అదుపులో ఉంచుకునేందుకు కొంత మంది వ్యక్తులు టెండర్ ప్రక్రియను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వారి చర్యలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

రాజంపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నిపుణులు తయారు చేసిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను గీతాం జలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ సోమవారం రాజంపేట, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు, చిట్వేలి మండలాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. లయన్స్‌క్లబ్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు, కన్వీనర్ నరసింహ, ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు గోవింద భక్తుల మహా పాదయాత్ర



తిరుమలకు బయలుదేరిన గోవింద మాలధారులు

సుండుపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గోవింద మాలధారుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మండల కేంద్రంలోని విరూపాక్షి చెన్నకేశవస్వామి ఆలయం నుంచి తిరుమలకు మహాపాదయాత్ర ప్రారంభమైంది. మండలానికి చెందిన వందలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి బయలుదేరారు. గురుస్వాములు పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి స్వాములను సాగనంపారు. వెంకటేశ్వరస్వామి చిత్రపటంతో వెళుతున్న భక్తులకు స్థానికులు కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చారు. వీరు వైకుంఠ ఏకాదశి నాటికి తిరుమలకు చేరుకుంటారు.

జూనియర్ కళాశాలకు భోజనం ప్లేట్ల అందజేత

నందలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కావడంతో శ్రీ సౌమ్యనాథ ఫిల్లింగ్‌స్టేషన్ అధినేత ఉప్పుశెట్టి సుధీర్ 120 స్టీల్ పేట్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీదేవి దాతను అభినందించారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం దాతను ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

రైతులు సంఘటితం కావాలి

సంబేపల్లె, జనవరి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సమస్యలపై సంఘటితం కావాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. సంబేపల్లె మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రైతు సంఘం జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా పూర్తి చేసి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు కాలువ నాగిరెడ్డి జలాశయం, ఝరికోన ప్రాజెక్టు పనులను సత్వరం చేపట్టి సాగునీరు అందించాలని కోరారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రేపు భారీ ర్యాలీ

రాజంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డ్రగ్స్, మత్తుపానీయాలకు వ్యతిరేకంగా ఈ నెల 8న 6 వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవీ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో 5 కిలోమీటర్ల మేర నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, విశ్వవిద్యాలయ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి హాజరవుతారన్నారు. అన్నమయ్య ట్రస్టు ఛైర్మన్ సి.రామచంద్రారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొంటారన్నారు. ప్రముఖ సినీనటుడు, వ్యక్తిత్వ వికాస శిక్షకుడు కేవీ ప్రదీప్ ప్రసంగిస్తారన్నారు. ఈ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిత్యపూజ కోన అభివృద్ధికి చర్యలు తీసుకోండి

సిద్దవటం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా రూ.25 లక్షలకు పైగా ఆదాయం వస్తున్నా నిత్యపూజ కోన అభివృద్ధికి దేవాదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సోమవారం ప్రజా సమస్యల వేదికలో శ్రీ సుముఖి అన్నపూర్ణదేవి సేవాసమితి ట్రస్టు సభ్యులు జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 26న జరిగే మహాశివరాత్రి వేడుకలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాల మార్గమధ్యంలో ఆపకుండా తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో జరిగిన లోపాలను గుర్తుంచుకుని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కార్యక్రమంలోట్రస్టు సభ్యులు వెంకటకృష్ణయ్య, ఉపేంద్ర, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువుకు నీరందించాలి

ఒంటిమిట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఒంటిమిట్ట చెరువుకు నీరందించాలని జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్ మండల రైతులతో కలిసి మాజీ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య వినతిపత్రం సమర్పించారు. చెరువులో నీరు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారని, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరో మూడు నెలల్లో కోదండరామాలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, ఈ సందర్భంగా తాగునీరు, ఇతర అవసరాలకు భక్తులకు ఇబ్బంది ఏర్పడుతుందని వెంటనే పైప్ లైన్లకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల రామకృష్ణ, చెరువు సంఘం డైరెక్టర్ రేవిళ్ల బాలమునెయ్య, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రోగ్రెసివ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాయచోటి నియోజకవర్గ అధ్యక్షుడుగా రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో గౌరవాధ్యక్షుడుగా మావులూరి విశ్వనాథ్, కార్యదర్శిగా రెడ్డిశేఖర్, ఉపాధ్యక్షుడుగా రాజు, కమిటీ సభ్యులుగా రమణ, గంగయ్య, సుశీలమ్మ, తులసమ్మ, కృష్ణవేణి, భారతి, నాగమ్మ, నాగలక్ష్మి, ఈశ్వరమ్మను ఎన్నుకున్నారు. .

పొదుపు సభ్యులకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలి

వీరబల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యులకు స్థిరమైన జీవనోపాధి కల్పించాలని మండల అభివృద్ధి అధికారిణి నూర్జహాన్ సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సమాఖ్యల సి బ్బంది సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ సంస్థ ల నుంచి పొందే రుణాల ద్వారా మెరుగైన జీవనోపాధి ఏర్పాటు కు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు అవసరమైన రుణాలు వెంటనే మంజూరు చేయాలని హౌ సింగ్ ఏఈ వెంకటేశ్‌ను కోరారు. గ్రామ సమాఖ్యల సిబ్బంది సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకోవాల న్నారు. నిర్వహణ సక్రమంగా జరగాలని, సంఘాలన్నీ ఏ గ్రేడ్‌తో ఉండేలా చేసుకోవా లన్నారు.

ఎలక్ట్రికల్ షాప్ యజమానుల కార్యవర్గం ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎలక్ట్రికల్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఆరవేటి వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని చిత్తూరు రోడ్డులో ఉన్న ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా పెన్నార్ బాబ్జి, కోశాధికారిగా సునీత రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా జోహార్, గౌరవ అధ్యక్షుడుగా చెన్నూరు నిస్సార్‌బేగ్, కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా హనుమాన్, బ్రైట్ సర్దార్, నవీన్, ఇమ్రాన్, మహేశ్, ఆరిఫ్, రెడ్డిదీపక్, అఫ్తాబ్ ఎన్నికయ్యారు

సమస్యలు పరిష్కరించండి

సిద్దవటం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజకోనలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి వెళ్లే దారి పూర్తిగా దెబ్బతినిందని, తాగు నీటి గుండాల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో నీరు దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా వన్యప్రాణులకు అపాయం సంభవించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయమై ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునశర్మ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల లోపు పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ధాన్యం కొంటారా...?

- మొదలుకాని ధాన్యం కొనుగోళ్లు
- ఎమ్మెల్యే చొరవ చూపినా ఆలస్యమే!
- అన్నదాతల ఎదురుచూపు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నదాతలకు అండగా నిలిచింది. గత ఏడాది వైసీపీ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇతర జిల్లాల్లో ప్రక్రియ సజావుగా సాగుతూ కీలకదశకు చేరుకున్న తరుణంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రాంతంలో ఇప్పటికీ కొనుగోలు ప్రక్రియ మొదలుకాలేదు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రత్యేక చొరవ చూపినా అనివార్య కారణాలతో అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో అన్నదాతలు మద్దతు ధర కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగానే సాగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఎకరాకు సగటు 33 నుంచి 38 బస్తాల వరకు ధాన్యం దిగుబడులు వచ్చాయి. నియోజకవర్గంలో ఒక్క ప్రొద్దుటూరు మండలంలో 3,700 ఎకరాల్లో వరి సాగైంది. రాజుపాళెం మండలంలో 2,500 ఎకరాల వరకు రైతులుసాగు చేశారు. వరి కోత దశ చేరిన సమయంలో నవంబరు, డిసెంబరు నెలల్లో చోటు చేసుకున్న వాతావరణ మార్పులు, రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. వరుస అల్పపీడనాలతో కోత దశలోని వరిపైరు అతలాకుతలం అయింది. పంట తడిసి నీటమునిగి రైతులు నానా తంటాలు పడ్డారు. చేతికొచ్చిన పంటను ఆరబెట్టుకునేందుకు నిలువ ఉంచుకునేందుకు తగిన సౌకర్యం లేక గిట్టుబాటు ధర లేకపోయినా విధి లేని పరిస్థితుల్లో ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నారు. ఇదే అదునుగా తేమ శాతం అధికంగా ఉందని, 78 కిలోల బస్తాకు రూ.1300 నుంచి రూ.1400 చెల్లించి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు లేకుండా దోపిడీకి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో చేతికందిన దిగుబడిని ఎక్కడ దాచిపెట్టాలో, ఎవరికి అమ్ముకోవాలో తెలియని ఆందోళనకు అన్నదాతలు గురయ్యారు. వర్షాల ప్రభావంతో కోతలను వాయిదా వేసుకుని ఆలస్యంగా యంత్రాల సహాయంతో నూర్పిళ్లు ప్రారంభించారు. కూలీల చేత పంట కోత ఆలస్యం అవుతుండడం, కూలీల కొరత ఉండడం, అధిక వ్యయాలతో యంత్రాలపై ఆధారపడి పంటను సాగు చేసుకునే చర్యల్లో నిమగ్నమయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో...

ఒకవైపు వరుస అల్పపీడనాలు, వర్షాలు, మరోవైపు సరైన గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతన్నకు అండగా నిలిచేందుకు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవ చూపి జిల్లా వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల అధికారులతో చర్చించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రొద్దుటూరులోనే ధాన్యం కొనుగోలు చేసేలా ఒప్పించారు. ఎట్టకేలకు డిసెంబరు 23వ తేదీ నుంచి ప్రొద్దుటూరులోనే కొనుగోలు ఏర్పాటు చేయనున్నట్లు రైతుల వద్దకు వెళ్లి ఎంఎస్‌పీ రేటు ప్రకారం క్వింటా రూ.2,300 ధరతో సివిల్‌సప్లై అధికారులు కొనుగోలు చేస్తారని వ్యవసాయాధికారులు ప్రకటించారు. అన్నదాతలు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఈ కేంద్రాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే సాంకేతిక పరమైన అనుమతులు అందక, మిల్లుల నుంచి ఏర్పడిన సమస్యల కారణంగా కొనుగోలు ప్రారంభం తేదీ వాయిదా పడింది. సమస్యలు తొలగి అధికారుల నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తాయోనని రైతన్నలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.


కానపల్లెలో రైతులు ఆరబెట్టిన ధాన్యం

త్వరలో కొనుగోలు చేస్తాం

అన్నదాతల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అతి త్వరలో చేపడతాం. మిల్లర్ల వద్ద నుంచి బ్యాంకు గ్యారెంటీలు అందడం ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం.

-అర్జునరావు, డీఎం, పౌరసరఫరాల సంస్థ

గిట్టుబాటు లేకపోయినా...



అల్పపీడనాలతో ధాన్యం తడిసి నష్టాల భయంతో 78 కిలోల బస్తా రూ.1400 చొప్పున ప్రైవేటు మిల్లులకు అమ్ముకున్నాను. అధికారుల నుంచి ఎలాంటి ప్రకటనలు వెలువడకపోవడంతో గిట్టుబాటు ధర లేకపోయినా అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

- ఏటూరి సుధాకర్, చెంచుపల్లె గ్రామం

ధర నచ్చక...



ప్రైవేటు మిల్లర్ల యజమానులు చెప్పే ధర నాకు నచ్చలేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు వారు చెప్పే రేటు గిట్టుబాటు కావడం లేదు. ధాన్యం ఎండబెట్టి ఇంటి వద్దనే నిలువ ఉంచాను. సరైన ధర వచ్చినప్పుడు అమ్ముతాను.

- కె.వెంకటసుబ్బయ్య, కానపల్లి

నైపుణ్య శిక్షణతో మంచి ఫలితాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమమైన ఉపాధి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి స్కిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి దాసరి నాగార్జున, కమిటీ సభ్యులందరూ జిల్లాలో నైపుణ్య శిక్షణల గురించి వారి అభిప్రాయాలను కలెక్టర్‌కు వివరించారు. అలాగే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సంకల్ప స్కీంతో జిల్లాలో చేపట్టాల్సిన నైపుణ్య కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులదరికీ వివరించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యక్రమం గురించి కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చించారు. జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువతకు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాలను రూపకల్పన చేయాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి, సభ్యులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో పీఎం ఇంటర్న్‌షిప్ కరపత్రాలను కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, జేడీ అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, లీడ్ బ్యాంకు మేనేజర్, రాయచోటి మున్సిపల్ కమిషనర్, కమిటీ సభ్యులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు

జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కృష్ణ వెల్లడి


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జేడీ, యూనియన్ నేతలు

రాయచోటి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు కృష్ణ తెలిపారు. సోమవారం జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన-2025 సంవత్సరపు క్యాలెండర్‌ను చేనేత, జౌళి శాఖ జిల్లా సమాయ సంచాలకులు కృష్ణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. చేనేత కార్మికులకు ఇలాంటి సంఘాల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. 34 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి, చేనేత రంగ రక్షణకు చేనేత కార్మిక యూనియన్ నాయకులు పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను మా శాఖ ద్వారా సక్రమంగా అమలు చేస్తామని, చేనేత కార్మికులకు ఏదైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే మమ్మల్ని నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

సమావేశంలో చేనేత, జౌళిశాఖ సహాయ అభివృద్ధి అధికారి వెంకటకుమార్, ప్రవీణ్‌కుమార్‌రాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంమోహన్, రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి, జిల్లా అధ్యక్షుడు గుంపు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మోడెం వెంకటేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిశెట్టి తిరుమలేశ్, తంబళ్లపల్లె అధ్యక్షుడు అనంత ఈశ్వరయ్య తదితర చేనేత కార్మికులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల మృతి

ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు.. పొలంలో గుండెపోటుతో మరొకరు


తలారి సుబ్బమ్మ (ఫైల్)

పెద్దతిప్పసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటనలు పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగాయి. ఆయా కుటుంబీకులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులికల్లు గ్రామానికి చెందిన తలారి బావన్న భార్య తలారి సుబ్బమ్మ (65) సోమవారం ఉదయం బహిర్భూమికి ఆరు బయటికి వెళ్లి వస్తూ కిందపడిపోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించే క్రమంలో ఆమె మృతి చెందినట్లు తెలియచేశారు. అదే విధంగా మండలంలోని రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లెకు చెందిన జగడం క్రిష్ణమూర్తి భార్య జగడం కళావతమ్మ (55) సోమవారం మధ్యాహ్నం తమ కుటుంబ సభ్యులు పొలం పనులు చేస్తుండగా వారికి భోజనం తీసుకెళ్లింది. పొలం వద్దకు చేరుకోగానే ఉన్నట్టుండి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయింది గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేయగా వాహనం అక్కడకు చేరుకుంది అప్పటికే ఆమె మృతి చెందినట్లు సిబ్బంది తెలియ చేశారు. మృతురాలికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.

ప్రజల ఫిర్యాదులను అలక్ష్యం చేయొద్దు


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా వెంటనే వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారికి మాట్లాడి సమస్యలను తెలుసుకొని వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సమస్యలపై విన్నవించుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్స్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. ఆ ఫిర్యాదులపై కూడా సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



ఒంటిమిట్ట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన రైతు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని గంగపేరూరుకు చెందిన దూల సుబ్బారెడ్డి (57) వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల పాలయ్యాడు.

వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచక పోవడంతో రెండు రోజుల క్రితం పొలం వద్ద షెడ్డులో పురుగుల మందు తాగాడు, అపస్మారక స్థితిలో పడిపోయిన అతనిని బంధువులు కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.



ములకలచెరువు గజ..గజ...

- ఉదయం 10 గంటల వరకు కప్పేసిన పొగమంచు

ములకలచెరువు, జనవరి 6: ములకలచెరువును సోమవారం పొగమంచు కప్పేసింది. ఉదయం 10 గంటల వరకు పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ పొగమంచుతో పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు వణికిపోయారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచుతో ఎదురుగా వచ్చిన వాహనాలు కన్పించకపోవడంతో లైట్లు వేసుకుని నెమ్మదిగా రాకపోకలు సాగించారు.


పొగమంచులో జాతీయ రహదారి

శ్రీగంధం సాగు.. ఆదాయం బాగు...

- గతంలో పొలాల గట్లపై...
- స్మగ్లర్లతో అంతరించిన వైనం
- మళ్లీ సాగు చేస్తున్న రైతులు
- కోడూరు నుంచి ఏడాదికి 6 లక్షల మొక్కల ఎగుమతి

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీగంధం చెట్ల సాగుతో మంచి ఆదాయం గడించవచ్చని కొందరు రైతులు వీటి సాగు పట్ల మక్కువ చూపుతున్నారు. గతంలో రైతులు తమ పొలాల గట్ల పైన వీటిని నాటుకునే వారు. అయితే స్మగ్లర్లు వాటిని నరికివేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. దీంతో శ్రీగంధం చెట్లు లేకుండా అంతరించిపోయాయి. అయితే వీటిని మళ్లీ రైతులు సాగు చేస్తున్నారు. శ్రీగంధం చెట్టు పెద్దగా లావు ఉండదు. సుమారు 20 అడుగుల ఎత్తు పెరుగుతుంది. శ్రీగంధం బెరడు, పుల్లలు, కాండం తదితరాలు పనికి వస్తాయి. ఒక్క శ్రీగంధం చెట్టు బాగా పెరగడానికి సుమారు 25 ఏళ్ల సమయం పడుతుంది. పుల్లలు, కాండంలను ముక్కలుగా కట్ చేసి ఆయిల్ తీస్తారు. బెరడు నుంచి వచ్చిన పౌడర్‌ను సోప్స్ పరిశ్రమలకు పంపిస్తారు. శ్రీగంధం నుంచి తీసిన ఆయిల్ ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాల్లో దానిని కలుపుతారు.

దేశంలోని కోల్‌కత్తా, బెంగళూరు, హరియానా, కొవ్వూరు ప్రాంతాల్లో శ్రీగంధం పరిశ్రమలు ఉన్నాయి. ఎక్కువగా శ్రీగంధం మొక్కలు తెలంగాణ, మైసూరు, గుంటూరు, ప్రకాశం, ఒరిస్సా తదితర ప్రాంతాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఒక్క శ్రీగంధం మొక్క 20 రూపాయలకు రైల్వేకోడూరు నర్సరీల్లో విక్రయాలు చేస్తున్నారు. టన్ను శ్రీగంధం చెక్కలు రూ.7 లక్షలు ధర ఉంది. వీటికి విపరీతంగా డిమాండ్ ఉంది. నాణ్యత గల ఆయిల్ కిలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. ఎకరా పొలంలో శ్రీగంధం సాగుకు రూ.70 వేల నుంచి రూ.80 వేలు అవుతుంది.


రైల్వేకోడూరు మండలంలో సాగవుతున్న శ్రీగంధం చెట్లు

మొదట ఖర్చు ఎక్కువగా అనిపించినా రాను రాను ఖర్చు తక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. ఎకరాకు 500 మొక్కలు పడతాయి.

ఇతర దేశాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది. రైల్వేకోడూరులో 11 ఏళ్ల నుంచి వివిధ నర్సరీల వ్యాపారులు మొక్కలను పెంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. 2011 నుంచి కరోనా సమయం వరకు ప్రతి ఏడాది 6 లక్షల మొక్కలను ఎగుమతి చేశారు. కరోనా తర్వాత ప్రతి ఏటా లక్ష మొక్కలను ఎగుమతి చేశారు. ప్రస్తుతం మళ్లీ వ్యాపారం పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో సుమారు 50 ఎకరాల్లో శ్రీగంధం మొక్కలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటను కాపాడుకోవాలి. స్మగ్లర్ల భయం ఎక్కువగా ఉంటుంది. స్మగ్లర్ల కంటికి కనిపిస్తే చాలు నరికివేసి వాటిని తరలిస్తారు. కాబట్టి జాగ్రత్తగా ఈ పంటను కాపాడుకుంటే మంచి లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఎర్రచందనం కంటే ఎక్కువగా డిమాండ్ కల్గింది శ్రీగంధం. వివిధ కంపెనీలకు చెందిన శాండల్ ఉడ్ సోప్స్ మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఎక్కువగా మైసూరులో తయారు చేసే శాండల్ సోప్స్‌ల్లో శ్రీగంధంను వినియోగిస్తున్నారు. ఇలాంటి ఆదాయం వచ్చే శ్రీగంధం సాగును రైతులు మరింత చేపడితే లాభాలు పొందవచ్చు. ఎకరాకు ఆదాయం సుమారు రూ.కోటి వస్తుందని అంచనా. నియోజకవర్గంలో రైతులు శ్రీగంధం సాగుపై ప్రస్తుతం రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.


రైల్వేకోడూరు నర్సరీలో శ్రీగంధం మొక్కలు

ఆదాయం ఉందని సాగు చేస్తున్నాము

శ్రీగంధం సాగులో ఆదాయం బాగా ఉందని సాగు చేపట్టాము. ఇప్పటికి ఏడాది అయింది. మొదట ఖర్చు ఎక్కువగా వచ్చినా తర్వాత సాగుకు ఖర్చు తగ్గింది. సాగులో ఎలాంటి ఇబ్బంది లేదు. స్మగ్లర్ల భయం తప్ప మరేది లేదు. శ్రీగంధంకు మంచి డిమాండు ఉంది. ధర కూడా బాగా ఉంటుంది.

- చంగల్రాయుడు, రైతు, రైల్వేకోడూరు

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం

కొత్త ఏడాదిలో శ్రీగంధం మొక్కల పెంపకం చేపడుతున్నాము. అటవీశాఖ నర్సరీలో పెంపకం చేస్తాము. రైతులకు ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తాము. ఇందుకు ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. అనుమతి రాగానే మొదలు పెడతాము.

- శ్యాంసుందర్, రేంజర్, రెల్వేకోడూరు

ఉద్యానపంటలపై రైతుల ఆసక్తి

- పోరుమామిళ్ల డివిజనులో 7వేల ఎకరాల్లో సాగు
- రైతులకు ప్రోత్సాహకంగా రాయితీలు
- కొత్తగా రాయితీలు పొందాలంటే.. దరఖాస్తు చేసుకోవాల్సిందే..

పోరుమామిళ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల డివిజనులో రైతులు ఉద్యానపంటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల్లో అరటి, దానిమ్మ, మామిడి, తైవాన్ జామ, బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తూ దాదాపు 7వేల ఎకరాల్లో సాగు చేశారు. పోరుమామిళ్ల మండలంలో నాగలకుంట్ల, పుల్లీడు, బొప్పాపురం, రజాసాహెబ్‌పేట, అక్కల్‌రెడ్డిపల్లె, కవలకుంట్ల, రంగసముద్రం, గురప్పగారిపల్లె ప్రాంతాల్లో ఎక్కువగా బొప్పాయి, దానిమ్మ, తైవాన్‌జామ వంటి పంటలు సాగు చేశారు. సిద్దవరం సమీపంలో కొండుగారిపల్లె, చెన్నారెడ్డిపేట ప్రాంతాల్లో కూడా ఎక్కువగా తైవాన్ జామ, దానిమ్మ పంటలను సాగు చేశారు. నాలుగు మండలాలకు సంబంధించి దాదాపు 7వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. అరటి 1694 హెక్టార్లలో, బత్తాయి 409, ఆయిల్‌ఫాం 354, మామిడి 311, నిమ్మ 297, జామ 285, పసుపు 270, కొబ్బరి 275, టమోటా 245, తమ లపాకు 120, దానిమ్మ 104, సీతాఫలం 52, నన్నారి 39, డ్రాగన్‌ఫ్రూట్ 13, రేగుపండ్లు 61, రోజాపూలు 112, నేరేడు 11హెక్టార్లలో సాగయ్యాయి.

ఉద్యాన పంటలకు రాయితీలు ఇలా...

దానిమ్మ, జామ, బత్తాయి, నిమ్మ వంటి ఉద్యాన పంటల సాగు చేపట్టే రైతులకు మొక్కల పెంపకానికి ఖర్చులో దాదాపు 40 శాతం రాయితీ అందిస్తున్నారు. మామిడికి సంబంధించి హెక్టారుకు 178 మొక్కలకు రూ.13400, జామ 1111కు 29301, దానిమ్మ 667కు 26672, బత్తాయి నిమ్మ 278కు 16004, అంజీరా 625 మొక్కలకు 30వేలు, ఉసిరి 150కి 18వేలు, ఆవకాడో 425 మొక్కలకు రూ.18వేలు, వాక్కాయ 2500 మొక్కలకు 18వేలు వంతున ఇస్తారు. టమోటా, వంకాయ, కాకర లాంటి కూరగాయల పంటలను ఆధునిక సాంకేతికంగా పేపరు వేసి లేదా కట్టలు కట్టి సాగు చేపడితే హెక్టారుకు ఒకటికి రూ.20వేలు ఆర్థిక సాయం అందుతుంది. వివిధ రకాల ఉద్యానపంటలను మల్చింగ్ లేదా పేపరు వేసి సాగు చేస్తే హెక్టారు ఒకటికి రూ.16వేలు రాయితీ అందజేస్తారు. సాగునీటి వనరులను రైతులు నిల్వ చేసుకుని పంటలు వాడుకోవడానికి పంట పొలంలో నీటి కుంటలు 20 ఇంటు 20 ఇంటు 3 ఘన మీటరులో ఏర్పాటు చేసుకుంటే రూ.75వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. రైతు పండించిన ఉద్యా న ఉత్పత్తులన్నీ గ్రేడింగ్ చేసి నేరుగా పొలం నుంచి మార్కెట్‌కు తరలించడానికి పొలంలో ఫామ్ హౌస్ నిర్మించుకుంటే రూ.2 లక్షలు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారు. కూరగాయ, ఉద్యాన పంటల నారు పెంపకం మార్కెట్ అధిక డిమాండ్ ఉండి పూలు, కూరగాయల సాగు చేపట్టిన పాలిహౌస్ షెడ్డు నిర్మాణానికి ఎకరాకు ఆర్థికసాయం అందిస్తున్నారు. అన్ని ఉద్యానపంటలకు 70 నుంచి 90 శాఇతం వరకు రాయితీ వరకు డ్రిప్ మరియు తుంపర పరికరాలను నీటి వసతి ఉన్న ప్రతి రైతుకు అందిస్తున్నారు. జామ, దానిమ్మకు, బొప్పాయి, అరటి పంటలపై రైతులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తుండడంతో ఈ ప్రాంతంలో ఉద్యానపంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఉద్యానపంటల రాయితీలపై ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాసరెడ్డి వివరణ కోరగా, గత ఏడాదికి సంబంధించి రైతులకు రాయితీలు అందాయని, ఈ ఆర్థిక సంవత్సరానికి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామని తెలిపారు.



నాగలకుంట్లలో బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి శ్రీనివాసరెడ్డి



మల్చింగ్ పద్ధతిలో ఉద్యానవన పంటల సాగు



డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అరటి సాగు చేసిన దృశ్యం



ఉద్యానపంటలకు రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంటలు

ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపండి



ఆర్టీసీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

కడప మారుతీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో కలపాలని ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి గంగాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో సుమారు 8 వేల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని.. వీరందరికీ జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా బ్యాంక్ అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించేలా చూడాలన్నారు. విధుల్లో వుండే కార్మికుడికి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే సంబంధిత ఆర్టీసీ డిస్పెన్సరీ హాస్పిటల్‌లో వైద్యం అందేలా చూడాలన్నారు. ఇందుకు చైర్మన్ స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ కోశాధికారి పి.సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షుడు గజపతి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఈ డీఈఓ మాకొద్దు

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినేవిధంగా డీఈఓ మీనాక్షి ప్రవర్తిస్తున్నారని.. తక్షణం ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే మూకుమ్మడిగా క్యాజువల్ లీవ్ పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం లేని.. ఉపాధ్యాయులు, లెసన్ ప్లాన్ అంటే తెలియని డీఈవోని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడే విధానాన్ని వివరించారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వెంకటశివారెడ్డి, రామమూర్తి, బాలగంగిరెడ్డి, ఇలియాస్ బాష, ఖాదర్ బాష, కొండారెడ్డి, లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, అబ్దుల్లా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో దుకాణాల ఏర్పాటు హక్కులకు 10న వేలం

లక్కిరెడ్డిపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మజాతరలో తలనీ లాల సేకరణ, కొబ్బరికాయల విక్రయం, టోల్‌గేట్ వసూలు హక్కులకు ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురం గంగమ్మ ఆలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసులు తెలిపారు.ఈ నెల 6న నిర్వహించాల్సిన వేలం అనివార్య కారణా ల వల్ల 10వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేల ధరావతు చెల్లించాలన్నారు. హక్కులు దక్కించుకున్నవారు సగం మొత్తం వెంట నే చెల్లించాలని, మిగిలిన మొత్తం 10 రోజుల్లో చెల్లించాలన్నారు.

సామాజిక పెన్షన్లపై క్షేత్రస్థాయి విచారణ

ఒంటిమిట్టజనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పెన్షన్లపై సోమవారం డాక్టర్ల బృందం క్షేత్రస్థాయిలో వి చారణ చేసింది. మంచానికే పరిమి తమై లేవలేని స్థితిలో ఉన్నామని దరఖాస్తు చేసుకున్న పది మంది ఇళ్లవద్దకు వెళ్లి పరిశీలించారు. పెరా లసిస్, ఇతర సమస్యలతో లేవలేని స్థితిలో ఉన్నామ ని డీఎంహెచ్‌ఓకు దరఖాస్తు చేయ డంతో మండలంలోని పది మందికి పెన్షన్ పంపిణీ చేస్తున్నారు. ఈ బృందంలో డాక్టర్ మహేందర్ రెడ్డి, ఉజ్వల, డాక్టర్ హైలేందర్‌సింగ్, తదితరులు ఉన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వివరాలు తెలియజేశారు.

రాజంపేటలో పట్టపగలే చోరీ

రాజంపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో పట్టపగలే ఇంటి తలుపులు పగులగొట్టి 15 తులాల బంగారం, నగదు చోరీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగరాజు, లక్ష్మి సోమవారం విధులకు వెళ్లి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడం గమనించా రు. పడక గదిలో ఉన్న బీరువాలోని 15 తులాల బంగారం, నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. రాజంపేట మన్నూరు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ మహ్మద్‌అలీ, హెడ్‌కానిస్టేబుల్ నందకుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



బీరువాను పగులగొట్టి చిందరవందరగా పడేసిన వస్తువులు

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై బోల్తాపడిన ట్రాక్టర్

చక్రాయపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన సోమవారం కట్టెల ట్రాక్టర్ బోల్తా పడింది. అయితే అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళితే .... బొగ్గలబట్టీ కోసం చక్రాయపేట నుంచి వేంపల్లె వైపు ట్రాక్టర్ కట్టెలు వేసుకొని వెళ్తుండగా మారెళ్లమడక బస్‌స్టాప్ వద్ద వేగం అదుపుకాక రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డులో బోల్తాపడింది. అప్పుడే ఆర్టీసీ బస్ వస్తుండగా డ్రైవర్ చాకచక్యంతో తప్పించడంతో ప్రమాదం జరగలేదు. కానీ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. హైవే కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మేకలు మేపుకోవడానికి వెళ్లి వ్యక్తి అదృశ్యం

సికెదిన్నె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మేకలు మేపుకోవడానికి వెళ్లిన బ్రహ్మయ్య అనే వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదని.. కుటుంబ సభ్యులు సికెదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. చింతకొమ్మదిన్నె మండలం పెద్ద కాంపల్లె గ్రామానికి చెందిన బ్రహ్మయ్య మూడు రోజుల క్రితం రోజుమాదిరిగానే మేకలు మేపుకోవడానికి కొండప్రాంతానికి వెళ్లాడు. అయితే మేకలు తిరిగి ఇంటికి వచ్చినా బ్రహ్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీకోసం అనేక చోట్ల గాలింపు చర్యలు చేపట్టినప్పటికి కనిపించలేదు. దీంతో సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

బి.కొత్తకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన సంజీవరాజు(46) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 16 ఏళ్ల క్రితం తనభార్య చనిపోవడంతో పాటు, 10 ఏళ్ల నుంచి వాయిసంబంధిత(ఫిట్స్)తో బాధ పడుతున్న సంజీవరాజు జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా సంజీవరాజు మరణ వార్త తెలియగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు గోపాళ్యం హరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జవన్‌గంగాధర్ బాబు పేర్కొన్నారు.

భూ వివాదంలో తమ్ముడిపై అన్న దాడి



గాయపడిన తమ్ముడు శంకర

నిమ్మనపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తండ్రి సంపాదించిన ఆస్తిని పంచుకొనే క్రమంలో తోడ బుట్టిన తమ్ముడిపై కొడవలితో అన్న దాడి చేసిన సంఘటన చోటు చేసుకొంది. మండలంలోని ముష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లెకు చెందిన చెంద్రాయప్ప కుమారుడు శంకర(45)కు అతని అన్న గుర్రప్పకు ఆస్తి విషయంలో తగాదా ఉంది. ఈ నేపథ్యంలో శంకర ఆదివారం రాత్రి బహిర్భూమికి పెద్దవంక వద్దకు వెళ్లగా అప్పటికే కాపుకాచి ఉన్న అన్న గుర్రప్పతో పాటు మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కొడవళ్లతో దాడి చేశారు. దీంతో శంకర కేకలు వేయడంతో గ్రామస్తులు రాగా.. గుర్రప్పతో పాటు ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. గాయపడిన శంకరను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రప్పపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

రీసర్వేపై రైతులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందాలి

- డీఎస్ఎల్‌వో కె.మురళీక్రిష్ణ

చెన్నూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9 నుంచి చేపడుతున్న రీసర్వేపై రైతులు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలని జిల్లా భూసర్వే అధికారి కె.మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామాన్ని రీసర్వేకు సంబంధించి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. సోమవారం గ్రామంలో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో మాట్లాడుతూ రీసర్వే ఎలాంటి వివాదాలు ఆరోపణలకు అవకాశం లేకుండా నిర్వహించాలన్నారు. ప్రతి రైతు ఈ రీసర్వే వల్ల తన భూమిపరంగా పూర్తి స్థాయిలో సంతృప్తి చెందాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు ప్రతి రైతుకు సమాచారం అందాలని.. తద్వారా రైతులు తమ భూముల వద్ద ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండల అధికారులతో సమావేశం నిర్వహించి రీసర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే ఈ నెల 9న గ్రామసభ నిర్వహించాలని ఆ సభకు రైతులు, ప్రజలు తప్పక హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు సోమశేఖర్, సర్వే డీటీ అర్చన, డీటీ వెంకటరమణ, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకటసుబ్బయ్య, సచివాలయ సర్వేయర్లు శివారెడ్డి, తేజా, ఆరిఫ్, రామచంద్ర, పవన్ పాల్గొన్నారు.



శివాలపల్లెలో రీసర్వేపై అవగాహన ర్యాలీ

కోడిపందాల నిర్వహణ చట్టరీత్యా నేరం : జేసీ

కడప కలెక్టరేట్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా వినతుల పరిష్కార వేదికలో కోడి పందేలు నిర్వహించుట చట్టరీత్యా నేరం అనే గోడ పత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహించుట జీవ జంతు సంరక్షణ చట్టం సెక్షన్ 34/1960, మరియు సెక్షన్ 1/1974 ప్రకారం చట్టరీత్యా నేరమన్నారు. అందులో పాల్గొన్న వారితో పాటు ఏ స్థలంలో నిర్వహిస్తారో వారికి కూడా వర్తిస్తుందన్నారు. కోడి పందేలు నిర్వహించే వారు 144 సీఆర్‌పీసీ ప్రకారం శిక్షార్హులు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.శార దమ్మ, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అధికారులు వెంకటరమణయ్య, లీలా స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

హమ్మయ్య.. గుంతలు పూడ్చుతున్నారు

- ప్రయాణికులకు కాసింత ఊరట
- జిల్లా సరిహద్దు నుంచి రోడ్డు పనులు ప్రారంభం

రైల్వేకోడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట-రేణిగుంట రోడ్డులో గుంతలతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడేవారు. గుంతలను తప్పించబోయి ప్రమాదాలు జరిగి కొందరు ప్రాణాలు కోల్పోగా చాలా మంది గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు-తిరుపతి, రాజంపేట-రైల్వేకోడూరు వైపు ప్రధాన రహదారి గుంతలు పడి పూర్తి స్థాయిలో దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతిలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు చేస్తోంది. సోమవారం రైల్వేకోడూరు-తిరుపతి సరిహద్దు నుంచి ప్రధాన రహదారిలో పనులను నేషనల్ హైవే అథారిటీ అధికారులు ప్రారంభించారు. గుంతలను పూడ్చి తారు రోడ్డు వేస్తున్నారు.



రైల్వేకోడూరు మండలం కుక్కలదొడ్డి వద్ద నుంచి రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

- తొలి మ్యాచ్‌లో సత్తా చాటిన కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలనే ధ్యేయంతో వివిధ టోర్నమెంట్స్ కడపలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ వెల్లడించారు. ఆ మేరకు ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు కడపలో ఏసీఏ అండర్-12 బాలుర అంతర్‌జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో కడప, చిత్తూరు జట్లు విజయం సాధించాయి.





తాహీర్(కడప) 54 నాటౌట్, ధనుష్ (చిత్తూరు) 110 పరుగులు, లిఖిత్ ఇరగంరెడ్డి (చిత్తూరు) 99 పరుగులు

36 పరుగులతో కడప జట్టు విజయం

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య సాగిన మొదటి మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇందులో తాహీర్ 54 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 29.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టు 31 పరుగులతో విజయం సాధించింది.

165 పరుగుల తేడాతో చిత్తూరు ఘన విజయం

కేఓఆర్‌ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 35 ఓవర్లలో కేవలం 3 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో ధనుష్ 110 పరుగులు చేయగా.. లిఖిత్ ఇరగంరెడ్డి 99 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 22 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. దీంతో చిత్తూరు జట్టు 165 పరుగుల భారీ స్కోర్ తేడాతో విజయం సాధించింది.

నిధులున్నా..సాగని పనులు

● పీటీఎంలో కుంటుపడుతున్న అభివృద్ధి ● అధిక పంచాయతీల్లో సర్పంచ్‌ల నిర్లిప్తత ●వర్గపోరుతోనే సమస్యలంటున్న జనం

పెద్దతిప్పసముద్రం జనవరి6 (ఆంధ్రజ్యోతి):పీటీఎం మండలంలోని గ్రామ పంచాయతీలకు రాజకీయగ్రహణం పట్టుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలలో మూలుగుతున్నా అభివృద్ధి పను లు మాత్రం ముందుకు సాగడంలేదు. పీటీఎం మండలంలో 20 పంచాయతీలు ఉండగా కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను మౌలిక వసతులు కల్పించేందుకు కేటాయించినా వాటిని చాలా పంచాయతీల్లో అభివృద్ధికి వినియోగించుకోకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోంది. పీటీఎం మండలంలోని అత్యధిక గ్రామ పంచాయతీలు వైసీపీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఉండడం ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కేవలం వర్గపోరుతోనే ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధిని విస్మరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో మూలుగు తున్న ఆర్థిక సంఘం నిధు లు ఇలాఉన్నాయి. మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి 2020- 24 సంవత్సరానికి 60 పనులు చేపట్టేందుకు రూ .19 లక్షల 85 వేల 169 గాను ఒక్క పని మాత్రమే జరుగుతోంది. ఇందుకు రూ 1లక్ష 60 వేలు మాత్రమే ఖర్చు చేయగా ఆ పని ఇంకా పూర్తి కాలేదు. అంకిరెడ్డిపల్లె పంచాయతీకి జనరల్ ఫండ్ రూ. 2లక్షల 61వేల 513 ఉంటే దీన్ని మొత్తం ఖర్చు చేశారు. బూర్లపల్లెలో జనరల్ ఫండ్ రూ.19 లక్షల60 వేల 337లు కాగా రూ.3లక్షల 24వేలు ఖర్చు చేశారు. మిగతా నిధులు అలాగే ఉన్నాయి. ఇక 14వ ఆర్థి సంఘం నిధులు రూ 13 లక్షల 93వేల 659లలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఇక పంచాయతీకి ఆదాయం రూ.31 వేల 701 రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఈ పంచాయతీకి 13వ ఆర్థిక సంఘం నిధులు 25 రూపాయలు మాత్రమే వచ్చాయి బూచిపల్లె గ్రామానికి 14వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ 4లక్షల 39వేల 601, జనరల్ ఫండ్ రూపంలో రూ.15 వేల 308రాగా వాటిని వినియోగించలేదు. దేవప్ప కోట పంచాయతీ గత ప్రభుత్వంలో నూతనంగా ఏర్పడింది. ఈ పంచాయతీలో టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్ కావడంతో అప్పటి ప్రభుత్వం చిన్నచూపు చూసి నిదులు మంజూరు కాకుండా చేశారు. జనరల్ ఫండ్ రూ 35 వేల 269 లు కాగా రూ. 23వేల 313లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదు. కమ్మచెరువు పంచాయతీ కూడా నూతనంగా



విసనకర్రవాండ్లపల్లెలో సిమెంట్ రోడ్డులేక బురదమయంగా మారిన ఓ వీధి(ఫైల్‌ఫొటో)

ఏర్పడింది. ఈ పంచాయతీలో జనరల్ ఫండ్ రూ 92వేల 978లు ఉండగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదు. కందుకూరు గ్రామంలో జనరల్ ఫండ్ రూ. 2లక్షల5వేల 70 ఉండగా లక్షా 84వేల 8వందలు ఖర్చు చేశా రు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.26 లక్షల 88వేల 792 లు రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,113 రాగా ఇవి ఖర్చు చేయలేదు. కాట్నగల్లు గ్రామంలో జనరల్ ఫండ్ రూ.15వేల 678లు ఉండగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 13వ ఆర్థిక సంఘం నిధులు రూ.1 657 రాగా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. మద్దయ్యగారిపల్లెలో జనరల్ ఫండ్ రూ.33వేల 569 ఉండగా మొత్తం ఖర్చు చేశారు.14వ ఆర్థిక సంఘం నిధులు రూ.15లక్షల 20వేల 677 రాగా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. మడుమూరులో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.13 లక్షల63వేల 343లు రాగా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. జనరల్ ఫండ్ రూ.ఒకలక్షా 68వేల 455 ఖర్చు చేశారు. మల్లెల గ్రామంలో జనరల్ ఫండ్ రూ. ఒకలక్షా19వేలు కాగా రూ.96వేల 865 ఖర్చు చేశారు. ఇక 14వ ఆర్థికసంఘం నిధులు రూ 18 లక్షల80 వేల 712లు రాగా ఇందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. నవాబు కోట గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పాటైంది. దీనికి జనరల్ ఫండ్ కింద రూ.48వేల 218 లు కాగా రూ.31 వేలు ఖర్చు చేశారు. దీనికి ఆర్థిక సంఘం నిధులు రాలేదు. పట్టెంవాండ్లపల్లెలో జనరల్ ఫండ్ రూ.39 వేల 203 లు ఉండగా రూ. 13వేల 884 ఖర్చు చేశారు మిగతా డబ్బులు అలాగే ఉన్నాయి. ఇక 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షల 81 వేల రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఇక స్టేట్ ఫైనాన్స్ నుంచి కేవలం 43 రూపాయలు మాత్రమే వచ్చాయి. మండల కేంద్రమైన పీటీఎంకు వెనుకబడిన ప్రాంతం నిధులు రూ 14వేల 615 రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 30 లక్షల 38 వేలు రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. జనరల్ ఫండ్ కింద ఉన్న రూ 7లక్షల 64వేల 591 ఉండగా రూ. 7 లక్షల 26 వేల 791లు ఖర్చు చేశారు. పోతు పేట పంచాయతీ నూతనంగా ఏర్పడింది. ఈ గ్రామానికి తెలుగుదేశం మద్దతుదారు సర్పంచ్‌గా కొన సాగుతుండగా ఈ పంచాయతీకి కనీసం సర్పంచ్ కూర్చునేందుకు కుర్చీ కూడా లేదు. ఈ పంచాయతీకి జనరల్ ఫండ్ కింద రూ. 90వేల 618లు ఉండగా మొత్తం ఖర్చు చేశారు. ఆర్థిక సంఘం నిధులు ఈ పంచాయతీకి మంజూరు కాలేదు. పులికల్లులో వెనుక బడ్డ ప్రాంతం నిధుల కింద రూ.60వేలు ఉండగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయ లేదు. జనరల్ ఫండ్ కింద ఉన్న రూ.52వేల 292లో రూ 26వేల 7వందలు ఖర్చు చేశారు. రంగసముద్రంలో వెనుకబడ్డ ప్రాంతం నిధుల కింద రూ. 33వేల 658లు రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. జనరల్ ఫండ్ కింద ఉన్న రూ 96వేల 737 ఉండగా ఇందులో రూ 74వేల 582లు మాత్రమే ఖర్చు చేశారు. రాపూ రివాండ్లపల్లె గ్రామంలో వెనుకబడ్డ ప్రాంతం నిధులు రూ. 86వేలు రాగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. జనరల్ ఫండ్ రూ. ఒకలక్షా 63వేల 520లు ఉండగా ఇందులో రూ ఒకలక్షా 44వేల 813లు ఖర్చు పెట్టారు. సంపతికోట గ్రామంలో జనరల్ ఫండ్ 47వేల 476 కాగా రూ. 46వేల 638 ఖర్చు చేశారు.14వ ఆర్థిక సంఘం నిధులు రూ 9 లక్షల 96 వేలు రాగా ఇందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. తుమ్మరకుంట గ్రామంలో జనరల్ ఫండ్ రూ 63వేల708లు కాగారూ 63 వేలు ఖర్చు చేయగా రూ.708లు మాత్రం మిగిలింది. టి.సదుం లో జనరల్ ఫండ్ రూ.ఒకలక్షా16వేల 860లు కాగా రూ. 79వేల 5వందలు ఖర్చు చేశారు.

వర్గాలతో కుంటుపడుతున్న అభివృద్ధి

మండలంలో అధిక పంచాయతీల్లో వైసీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉండడం తంబళ్లపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా వైసీపీ కావడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. నిధులు న్నా అభివృదికి సహకరించక పోవడంతోనే సమస్యల కలుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సిబ్బందిలేమితోనే ఇబ్బంది కలుగుతోంది

గ్రామ పంచాయతీల్లో సిబ్బంది కొరతతోనే అభివృద్ధికి ఇబ్బంది కలుగుతోంది. త్వరలో పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారిస్తాం.
-అబ్దుల్ కలాంఆజాద్, ఎంపీడీవో, పీటీఎం

మిట్స్ విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ స్కాలర్‌షిప్‌లు

కురబలకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ స్కాలర్ షిప్‌లు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజు పేర్కొన్నారు. కళాశాల్లో ఎన్‌సీఏ విభాగానికి చెందిన దీప్తి, గిరి, సహిత, సంధ్యారాణిలకు రూ.35 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశామన్నారు. కాగా విద్యార్థుల మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు మంజూరైనట్లు తెలిపారు. స్కాలర్ షిప్‌లు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి, చైర్మన్ ద్వారకనాథ్, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజు, మౌలాలీ అభినందించారు.

మృతి చెందిన వ్యక్తి ములకలచెరువు వాసి

ములకలచెరువు, జనవరి 6: ములకలచెరువులో ఆదివారం రాత్రి మృతి చెందిన వ్యక్తి ములకలచెరువు వాసిగా పోలీసులు గుర్తించారు. అతిగా మద్యం తాగి ముంబాయి - చెన్నై జాతీయ రహదారిపై పడుకుని ఉన్న వ్యక్తిపై ఐచర్ వాహనం వెళ్లడంతో దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన శ్రీనివాసులు(50)గా గుర్తించారు. గత కొన్ని రోజులుగా ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడని చెబుతున్నారు.

బర్త్ సర్టిఫికెట్ ఇవ్వండి

మదనపల్లె అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని సోమవారం నిమ్మనపల్లె చెందిన బాధితులు డిమాండ్ చేశారు. నిమ్మనపల్లె మండలం, ఎగువమాచిరెడ్డిగారిపల్లె చెందిన శివకుమార్ భార్య వరలక్ష్మీ పురిటి నొప్పులు రావడంతో 108లో మదనపల్లె ఆస్పత్రికి తరలిస్తుండగా శనివారం మగ బిడ్డను ప్రసవించింది. వెంటనే ఆమెను బిడ్డను మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం డిశ్చార్జీ సందర్భంగా బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరాగా మాకు సంబంధం లేదని ఆస్పత్రిలో డాక్టర్లు చెప్పారని వారు వాపోయారు.

అనాథ రోగి ఆస్పత్రికి తరలింపు

మదనపల్లె అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనాథగా పడిఉన్న మహిళను కర్ణాటక రాష్ట్రం రాయల్‌పాడు చెందిన 108 సిబ్బంది సోమవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. వారి వివరాల మేరకు రాయల్‌పాడు చెందిన మహిళ రాష్ట్ర సరిహద్దులో మహిళ అనాథగా పడిఉన్న విషయమై పోలీసుల చొరవతో ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

10న మండల మీట్

కురబలకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కురబలకోట ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 10న మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన కురబ కార్పొరేషన్ డైరెక్టర్



డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటరమణ

వాల్మీకిపురం, జనవరి 6(ఆంధ్రజ్యో తి): వాల్మీకిపురం మండలం జర్రా వారిపల్లెకు చెందిన మాజీ జడ్పీ టీసీ వల్లిగట్ల వెంకటరమణ రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. సోమవారం విజయవాడ గొల్లపూడి ప్రాంతం బీసీ భవన్‌లో ఆయన ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి చిత్తశుద్ధితో పనిచేసి న్యాయం చేస్తానని తనకు పదవి రావడం పట్ల సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్ముందు తనవంతుగా టీడీపీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వంతో రాబోవు రోజుల్లో అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా అధినేతలు పనిచేస్తున్నారన్నారు.

తిరుమలకు 400మంది పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వాల్మీకిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి):మదనపల్లె సమీపంలోని సుదర్శన సేన శ్రీవారి గోకులం ఆధ్వర్యంలో తిరుమలకు 400 మంది భక్తులు పాదయాత్ర చేపట్టారు. మాల ధరించిన భక్తులు వాల్మీకిపురం పట్టణం మీదుగా పాదయాత్ర సాగగా జాతీయ రహదారిపై వేంకటేశ్వరుని నామాలతో పాదయాత్ర సాగింది. సోమవారం మధ్యాహ్నం మండలంలోని చింతపర్తికి పాదయాత్ర చేరుకోగా గ్రామానికి చెందిన సుధాకర్ మిత్ర బృందం భక్తులకు అన్నదాన ఏర్పాట్లు, వసతి సౌకర్యాన్ని కల్పించారు. స్థానిక గుంటి గంగమ్మ ఆలయం సందర్శన అనంతరం భక్తులు తిరిగి తిరుమలకు పయనమయ్యారు. ఈకార్యక్రమంలో గురుస్వామి రాజశేఖర్, స్థానిక నాయకులు ద్వారకనాథరెడ్డి, సుధాకర్, పాదయాత్ర భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపంతో రోగాల బారిన పడుతున్నాం

●సీటీఎం 2 సచివాలయం వద్ద టీడీపీ నాయకుల నిరసన



సచివాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య లోపంతో అంటువ్యాధుల బారిన పడుతున్నామంటూ సీటీఎం 2 సచివాలయం ఎదుట సోమవారం టీడీపీ నాయకులు నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుంచి కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని, దీనికారణంగా గ్రామపంచాయతీ కార్మికులు విధులకు గైర్హాజరు కావడంతో చెత్తచెదారం పేరుకుపోయి దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయన్నారు. అసలే చలికాలం ఆపై పారిశుధ్య లోపంతో అంటువ్యాధులు బారిన పడుతున్నామని వాపోయారు. దీనిపై సచివాలయ సిబ్బందిని వివరణ కోరగా సర్పంచ్ తమకు సహకరించని కారణంగా జీతాలు బిల్లులు పెట్టాలేకపోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డిరాంప్రసాద్, చల్లా నరసింహులు, చల్లా శ్రీనివాసులు, మిట్టపల్లె రాజు, మిట్టపల్లె భాను, నరసిం హులు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలతోనే చిన్నారుల అభివృద్ధి

తంబళ్లపల్లె, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు మానసిక, శారీరక ధృడత్వానికి అంగన్వాడీ కేంద్రాలు కృషి చేస్తున్నాయని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంఈవో త్యాగరాజు పేర్కొన్నారు. సోమవారం తంబళ్లపల్లె అంగన్వాడీ కేంద్రంలో సీడీపీవో నాగవేణి ఆధ్వర్యంలో ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల్లో ప్రీ స్కూల్ యాక్టివిటీస్ ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధి ఏ విధంగా జరుగుతుంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం గురించి తల్లితండ్రులకు వివరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ...ప్రభుత్వం చిన్నారుల కోసం అంగన్వాడీ కేంద్రాల్లో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అంగన్వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధ, కుసుమ, ధనలక్ష్మీ, అంగన్వాడీలు ఉమ, సరస్వతీ, కళావతి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో 28 మంది పింఛన్లు తనిఖీ



గుండ్లగుట్టతాండాలో పెన్షన్‌దారుల వివరాలను ఆరాతీస్తున్న తనిఖీ బృందం

గుర్రంకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పెన్షన్‌ల తనిఖీ ప్రక్రియలో భాగంగా సోమవారం గుర్రంకొండ మండలంలో 28 పింఛన్లను అధికారులు తనిఖీ చేశారు. పక్షపాతం, కిడ్నీ రోగులకు సంబంధించి 57 పింఛనులు ఉండగా వారు ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్ సొమ్ము తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మొదటిరోజు టి.పసల వాండ్లపల్లె, నడిమికండ్రిగ, చెర్లోపల్లె, గుర్రంకొండ, సరిమడుగు, ఎల్లుట్ల గ్రామాలకు చెందిన 28 మంది పెన్షన్‌దారులను తనిఖీ బృందం పరిశీలించారు. పెన్షన్‌దారుల స్థితిగతులను పరిశీలించి నివేదికను ఉన్నతాదికారులకు అందజేస్తామని వైద్యులు జ్యోష్న, భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాయక్, ఎంపీడీవో వెంకటేశులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పీలేరులో తొలిరోజు 26 పింఛన్ల విచారణ

పీలేరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పింఛన్ల తనిఖీల్లో భాగంగా సోమవారం పీలేరు మండలంలో 26 పింఛన్ల లబ్ధిదారులను అధికారులు విచారించారు. కడప సర్వజన ఆసుపత్రికి చెందిన ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ మనోహర్‌లు పీలేరు పట్టణంలోని 26 మంది లబ్ధిదారులను విచారించారు. వారికి మండల ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ సహాయసహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్‌ఖాన్ మాట్లాడుతూ పీలేరు మండలంలో రూ.15 వేల దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారు 76 మంది ఉన్నారని, వారందరినీ వచ్చే రెండు రోజుల్లో విచారించనున్నట్లు తెలిపారు. విచారణ సారాంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తారని వివరించారు.

పింఛన్ లబ్ధిదారులకు నోటీసులు జారీ

నిమ్మనపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15వేల పింఛన్ పొందుతున్న 153మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలోని దివ్యాంగుల పింఛన్‌ల తనిఖీ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాను పైలెట్ ప్రాజక్టు కింద ఎంపిక చేయడంతో ఈ నెల 17నుంచి 24వరకు రూ.15వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదాలను విచారించి వారి సర్టిఫికెట్లను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. కాగా విచారణ అధికారులుగా కడప డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, రాయచోటి నుంచి డాక్టర్ రామరాజులులతో పాటు ఇతర సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. దీని కొరకు 15వేలు పింఛన్‌దారులు ఇళ్ల వద్దే ఉండి వారికి సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేయండి

పెద్దమండ్యం, జనవరి 6(ఆంధ్రజ్యోతి) వాటర్‌షెడ్ పథకంలో రైతులకు ప్రయోజనకరమైన పనులు చేపట్టలని డ్వామా ఏపీడీ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో సోమవారం ఆయన పర్యటించి పెద్దమండ్యం పాపేపల్లి గ్రామాల పరిధిలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ జరిగే ప్రాంతాలల్లో వాటర్‌షెడ్లను నిర్మించాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించడానికి వాటర్‌షెడ్‌లు దోహదపడాలన్నారు. అందురు బాధ్యతగా పని చేయాలన్నారు. వాటర్‌షెడ్ అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని నాసిరకం పనులు చేస్తే బిల్లుల జాప్యంతో పాటు శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. వాటర్‌షెడ్ జేఈ మోహన్, టెక్నికల్ అసిస్టెంట్ ఢిల్లీబాబు, వాటర్‌షెడ్ల చైర్మన్‌లు, రైతులు పాల్గొన్నారు.

చింతపర్తి హైస్కూల్‌కు రూ.1.74 లక్షల వితరణ



చింతపర్తి పాఠశాలకు చెక్కును అందజేస్తున్న జోస్ అలూక్కాస్ జ్యువెలరీ సిబ్బంది

వాల్మీకిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు సౌకర్యాల నిమిత్తం మదనపల్లె జోస్ అలూక్కాస్ జ్యువెలరీ ఆధ్వర్యంలో వితరణ కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలో రూ.1.74లక్షల విలువ గల ఫర్నిచర్, బీరువాలు, క్రీడాసామగ్రి, తదితరం ఏర్పాటు నిమిత్తం చెక్కును అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు, జోస్అలూక్కాస్ ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు.

అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలం మాదే

●సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు బాధితుడి వినతి



ప్రజల అర్జీలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం రెడ్డెప్పనాయుడు కాలనీలో అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలం తమదే అని, దానిపై హైకోర్టులో కేసు నడుస్తున్నా కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బాధితుడు కె.శ్రీరాములునాయుడు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుడు శ్రీరాములు మాట్లాడుతూ సర్వేనెంబరు 335లో 12 సెంట్ల స్థలాన్ని తాను మాజీ సైనికుడి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, కొందరు ఆ స్థలంలో పునాదులు వేయడంతో కోర్టుకు వెళ్లి, ఉత్తర్వులు తెచ్చుకుని పునాదులు తొలగించామన్నారు. దీనిపై ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. మదనపల్లె మండలం తురకపల్లె లోకల్ అథారిటిలో ఉందని, ఇక్కడ మురుగునీటి కాలువలు, రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నామని ఆరోగ్యవరం తురకపల్లెకు చెందిన ప్రజలు విన్నవించారు. తంబళ్లపల్లె మండలం కేంద్రంలోని తమ ఆస్తులను కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని కరీముల్లా అనే బాధితుడు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ ఇంటికి వెళ్లే రోడ్డును కొందరు కంచె వేసి అడ్డగించారని, దీనిపై సర్వే చేయించిన తమకు దారి సౌకర్యం కల్పించాలని బి.కొత్తకోటకు చెందిన అమీర్ సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. వీటితో పాటు భూములకు సంబంధించి పాసుపుస్తకాలు, సర్వే తదితర సమస్యలపై ప్రజలు సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.

వైకుంఠ ఏకాదశిన భక్తుల భద్రతను చూసుకోవాలి

మదనపల్లె టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలో భక్తుల భద్రతను చూసుకోవాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని రెండు రోజుల పాటు మదనపల్లె పట్టణంలోని ఆలయాల్లో 50 నుంచి 70వేల మంది భక్తులు దేవుడి దర్శనాలకు వస్తారని అంచనా ఉందన్నారు. పెద్దసంఖ్యలో వచ్చే భక్తుల భద్రతపై పోలీసు అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాల వద్ద వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స మందులతో సిద్ధంగా ఉండాలన్నారు. క్యూలైన్లను ఏర్పాటు చేయడంలో అగ్నిమాపక అధికారుల సూచనలను పాటించాలన్నారు. ఆలయాల వద్ద , భక్తులు తిరిగే చోట్ల మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సీఐలు ఎరిషావలి, రమేశ్, రామచంద్ర, వెంకటరమణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహకానికి ప్రభుత్వం చొరవ



టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఎంబీ టీమ్ నిర్వాహకులు

మదనపల్లె టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కోసం సీఎం చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వం చొరవ చూపుతోందని టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ మస్తాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బీటీ కళాశాల మైదానంలో మూడో రోజు జరుగుతున్న సుకుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌కు అతిథిగా వచ్చిన మస్తాన్ మాట్లాడుతూ మదనపల్లె మార్కెట్‌లోని మండీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రికెంట్ టోర్నమెంట్‌కు ప్రజల నుంచి ఆదరణ వస్తోందన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం వలన గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు ప్రోత్సాహం పెరుగుతోందన్నారు. ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు అందించడం క్రీడాకారులకు ఆర్థికంగా సహాయంగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వాహకులు ఎస్‌ఏ మస్తాన్‌ను శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంబీ టీమ్ నిర్వాహకులు బావాజాన్, టీవీఎస్ బాబు(పృధ్వీరాజ్), టీఎంబీ నూర్, హెల్పింగ్‌మైండ్స్ అబుబకర్ సిద్దిక్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కలెక్టర్ సొంత నిధులతో విద్యార్థులకు కార్పెట్లు



విద్యార్థులకు కార్పెట్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో

కలకడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సొంత నిధులతో కార్పెట్లను పంపిణీ చేసినట్లు ఎంఈవో మునీంద్రనాయక్ తెలిపారు. కలకడ మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ గత ఏడాది నవంబరు 23న గురు కుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతున్న సందర్భంలో సమస్యల గురించి అడుగగా కార్పెట్ల అవ సరముందని విద్యార్థులు తెలిపారు. దీంతో కలెక్టర్ రూ.70 వేలు ఖర్చు చేసి 350 కార్పెట్లను కొనుగోలు చేసి ఎంఈవో వద్దకు చేర్చారు. ఈ నేపథ్యంలో ఎంఈవో కార్పెట్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమిత్ర, పంచాయ తీ కార్యదర్శి నాగ భూషణం, బాలాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు 'సేవారత్న' పురస్కారం



నరసింహులుకు 'సేవారత్న' పురస్కారం అందజేస్తున్న మార్పు సేవా సంస్థ ప్రతినిధులు

తంబళ్లపల్లె, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా బడుగు, బలహీన వర్గాల సమస్యలను తీర్చడానికి కృషి చేస్తున్న తంబళ్లపల్లె పోర్డు సంస్థ బాలల హక్కుల ఐక్య వేదిక కన్వీనర్ ఆవుల నరసింహులుకు మార్పు (మాస్ అసోసియేషన్ ఫర్ రూరల్ పూర్) సేవా సంస్థ తిరుపతి వారు సేవా రత్న ప్రతిభా పురస్కారం అందజేశారు. ఆదివారం తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం లో మార్పు సేవా సంస్థ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, సంస్థ ప్రతినిధులు నరసింహులును దుశ్శాలువలతో సత్కరించి సేవారత్న పురస్కారం అందచేశారు. కనుమరుగవుతున్న జానపద కళలను మార్పు సేవా సంస్థ ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందచేస్తోంది. నరసింహులు గత 25 సంవత్సరాలుగా బీఆర్ అంబేడ్కర్ బాటలో పయనిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై గ్రామాలలో డప్పు కొడుతూ, పాటలు పాడుతూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాడు. ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించిన మార్పు సేవా సంస్థ సేవారత్న ప్రతిభ పురస్కారం అందచేసి సత్కరించింది.. ఈ పురస్కారం పొందడానికి కారణమైన పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, సిబ్బందికి నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

మదనపల్లె అర్బన్, జనవరి6(ఆంధ్రజ్యోతి):పలమనేరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల్లో విద్యార్థునులకు మదనపల్లెకు చెందిన ధాత్రి ఫౌండేషన్ నిర్వహకురాలు డాక్టర్ స్వాతి చక్రపాణి విద్యాసామగ్రి వితరణ చేశారు. నిరుపేద విద్యార్థునులకు పుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థునులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర కరువు బృందం రాక

బి.కొత్తకోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటనష్టం పై విచారణ చేసి నివేదిక ఇచ్చేందుకు కేంద్ర కరువు బృందం సోమవారం రానుంది. ముందస్తుగా ప్రకటించిన మేరకు పేరీన్‌దేవి సారథ్యంలో సుప్రియామాలిక్, అనురాధబటానా, ఆశిష్‌పాండేలతో కూడిన కరువుబృందం బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన హార్సిలీహిల్స్ కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేయనున్నారు. అనంతరం ఈనెల 8న ఉదయం 9గంటల నుంచి మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీ పరిధిలో దెబ్బతిన్న పంటలను నేరుగా పరిశీలించడంతో పాటు, వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చూస్తున్నారు.